RNI NO:TELTEL/ 2023/89546



# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక


## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326


రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 472 | పేజీలు : 8 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | శుక్రవారం 11 జూలై 2025 | వెల : 4/-



## కొత్త రేషన్ కార్డుల పంపిణీకి

# రంగం సిద్ధం

### అవి రాగానే ఊపందుకోనున్న ప్రక్రియ

### స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ కంటే ముందే కార్డుల పంపిణీ

- ఎన్నికలపై స్పష్టత వస్తే పంపిణీ తేదీలు ఖరారు కానున్నట్లు సమాచారం
- ఎమ్మెల్యేల చేతుల మీదుగా ప్రారంభించే అవకాశం
- ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా కొత్త రేషన్‌కార్డులు జారీ ప్రక్రియ, కుటుంబసభ్యుల పేర్లను పాత కార్డుల్లో చేర్చడం వంటివి జరిగాయి.
- ఈ నెల 14 నుంచి పంపిణీకి అవకాశం

హైదరాబాద్

అర్హులకు తెలంగాణ ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డుల జారీ ప్రక్రియను చేపట్టింది. కుటుంబ సభ్యుల పేర్లను కూడా పాత కార్డుల్లో చేర్చుతోంది. గత పదేళ్లుగా ఈ ప్రక్రియ నిర్వహించకపోవడంతో చాలా మంది అర్హులకు రేషన్‌కార్డులు దక్కలేదు. ఉచితంగా అందించే బియ్యం కోటా కూడా రాకపోవడంతో ఇన్నాళ్లుగా చెప్పులు అరిగేలా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగారు. ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు ఈ ఏడాది ఏప్రిల్ నెల నుంచి కొత్త రేషన్‌కార్డుల జారీ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా కొత్త రేషన్‌కార్డులు జారీ ప్రక్రియ, కుటుంబసభ్యుల పేర్లను పాత కార్డుల్లో చేర్చడం వంటివి జరిగాయి. ప్రస్తుతం వారికి కొత్త రేషన్ కార్డులను జారీ చేసి అందించనున్నారు. జూన్ 2వ తేదీ నాటికి జారీ అయిన కార్డులు ఇప్పటికే జిల్లా పౌరసరఫరాలశాఖ కార్యాలయాలకు చేరాయి. ఆ తర్వాత జారీ అయిన కార్డులను కూడా పంపించే అవకాశాలు ఉన్నాయని ఆ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. రేషన్‌కార్డుల జారీ, కుటుంబ సభ్యుల పేర్లను చేర్పు, మార్పుల ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని మంత్రులు, అధికారులు పేర్కొంటున్నారు. చాలా మంది ఉమ్మడి కుటుంబాలకు చెందినవారు వారి పేర్లను పాత రేషన్? కార్డుల నుంచి తొలగించాలని అప్లికేషన్లు పెట్టుకుంటున్నారు. పేర్లు తొలగించిన వెంటనే కొత్త రేషన్? కార్డులకు అప్లికేషన్లను చేస్తున్నారు. మొన్నటి వరకు పాత కార్డుల్లోంచి పేర్లను తొలగించడానికి చాలా మంది అస్సలు అంగీకరించలేదు. దరఖాస్తులు చేసుకున్న వారికి వెంటనే కొత్తకార్డులు జారీ కావడంతో ఒకరిని చూసి ఒకరు ఇలా చాలా మంది- మిగతా3లో



## కల్తీకల్లు మృతుల కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం ఇవ్వాలి

- రూ.10 లక్షలు, బాధితులకు రూ.లక్ష చొప్పున పరిహారం ఇవ్వాలి
- “కల్తీ కల్లు ఘటనలో అనధికారికంగా ఆరుగురు మృతి
- ఒకటి రెండు సీసాల కల్లు తాగిన వారి కిడ్నీలు దెబ్బతిన్నాయి
- భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు

## మీకు మేం ముఖ్యమో? కొండా ఫ్యామిలీ ముఖ్యమో?

# తేల్చుకోండి?



- మాజీ ఎమ్మెల్సీ కొండా మురళిపై చర్యలు తీసుకోవాలంటూ వరంగల్ కాంగ్రెస్ నేతలు అధిష్ఠానం వద్ద పట్టుబడుతున్నారు.
- ఈ సమావేశంలో కొండా మురళిపై చర్యలు తీసుకోవాల్సిందేనని క్రమశిక్షణ కమిటీకి తేల్చిచెప్పారు
- ‘క్రమశిక్షణ కమిటి ముందుకు రావాలి అంటేనే అవమానంగా ఉంది
- తిట్లు తిన్నది మేము.. కమిటి కూడా మమల్ని పిలిచింది

హైదరాబాద్

తమపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్సీ కొండా మురళిపై చర్యలు తీసుకోవాలంటూ వరంగల్ కాంగ్రెస్ నేతలు అధిష్టానం వద్ద పట్టుబడుతున్నారు. ఇదే అంశాన్ని క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి వద్ద ప్రస్తావించిన నేతలు.. మీకు మేం ముఖ్యమో? కొండా ఫ్యామిలీ ముఖ్యమో? తేల్చుకోవాలని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. జులై10 గాంధీ భవన్‌లో కాంగ్రెస్ క్రమశిక్షణా కమిటీ సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో కొండా మురళిపై చర్యలు తీసుకోవాల్సిందేనని క్రమశిక్షణా కమిటీకి తేల్చిచెప్పారు. ‘క్రమశిక్షణ కమిటి ముందుకు రావాలి అంటేనే అవమానంగా ఉంది. తిట్లు తిన్నది మేము.. కమిటి కూడా మమల్ని పిలిచింది అంటే ఎలాంటి సంకేతం ఇవ్వాలనుకుంటున్నారని ఎమ్మెల్యేలు ప్రశ్నించారు. కొండా మురళీపై చర్యలు తీసుకోవాల్సిందే. లేదంటే మాకు కూడా ఫ్రీ హ్యాండ్ ఇవ్వండని క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవికి - మిగతా3లో



## 100 ఏళ్లైనా.. ఏఐతో ఆ స్థానాలను భర్తీ చేయడం సాధ్యం కాదు

- ఏఐ కారణంగా ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగుల్లో అభద్రతా భావం పెరిగిపోయింది
- వచ్చే 100 ఏళ్లైనా ప్రోగ్రామర్లను ఏఐ భర్తీ చేయలేదు
- అంతేకాదు కోడింగ్ పైనా ఏఐ ప్రభావం ఉండదు
- ‘కృత్రిమ మేధ అనేది ప్రోగ్రామింగ్ రంగంలో మనిషికి ప్రత్యామ్నాయం కాలేదు.
- మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్



## సీఎంగా ఐదేళ్ల పాటు తానే కొనసాగుతా

- ‘కుర్చీ ఇప్పుడు ఖాళీగా లేదు’ అని ఆయనే అన్నారుగా..
- నాయకత్వం రొటేషన్‌పై పార్టీ హైకమాండ్ టైమ్‌లైన్ లేదా సూచనలు ఏమీ చేయలేదు
- రెండున్నర సంవత్సరాల అంశాన్ని ఎవరూ నిర్ణయించలేదు
- కర్ణాటక సీఎం సిద్ధరామయ్య



## గుండెపోటు భయాలు.. ఆ ఒక్క ఆస్పత్రికే వేలమంది క్యూ!

- కర్ణాటక హసన్ జిల్లాలో 40 రోజుల వ్యవధిలో 23 మంది మరణించారు.
- దేశంలో నిత్యం ఏదో ఒక మూల హఠాన్మరణం ఘటన చోటు చేసుకుంటోంది
- హార్ట్ ఎటాక్, కార్డియాక్ అరెస్టులతోనే వాళ్లు చనిపోతున్నారని డాక్టర్లు సైతం నిర్ధారిస్తున్నారు

## కూకట్‌పల్లి కల్తీ కల్లు కాటుకు ఐదుగురు బలి

- నిమ్స్ ఆసుపత్రిలో మరో 31 మంది చేరిక!
- కల్లు తాగిన కొద్దిసేపటికే బాధితులు వాంతులు చేసుకోవడం ప్రారంభించారు
- బాధితుల్లో ఎక్కువ మంది తరచూ కల్లు తాగుతుండడంతో వికారం వల్ల ఇలా జరిగి ఉంటుందని భావించారు
- కానీ పరిస్థితి విషమించడంతో మరుసటి రోజు ఉదయం ఆసుపత్రుల్లో ఒక్కొక్కరుగా చేరడం ప్రారంభించారు



హైదరాబాద్

కూకల్‌పల్లిలో కలకలం రేపిన కల్తీ కల్లు వ్యవహారంలో మృతుల సంఖ్య ఐదుకు చేరింది. సోమవారం రాత్రి కూకట్‌పల్లి, కెపీహెచ్‌బీలకు చెందిన 5 కల్లు కాంపౌండ్లలో కల్తీ కల్లు సేవించి ఐదుగురు మరణించారు. మరో 31 మంది ఆసుపత్రి పాలయ్యారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. మృతుల్లో శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన తాపీమేస్త్రీ సీతారాం (47), హైదర్‌నగర్‌కు చెందిన గృహిణి స్వరూప (61) ఉన్నారు. కూకట్‌పల్లిలో మరణించిన మరో ముగ్గురి పేర్లను పోలీసులు వెల్లడించలేదు. వీరు సేవించిన కల్లులో క్రియాటిన్ స్థాయిలు భారీగా పెరగడం వల్లనే మరణాలు సంభవించినట్లు దర్యాప్తులో తేలింది. - మిగతా3లో



## మా చరిత్రను తొలగిస్తే ఇక మేమెవరం?

- ప్రధాని మోదీకి కేటీఆర్ ట్వీట్
- బీజేపీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు మాధవ్ బహుమతిగా ఇచ్చిన మ్యాపులో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ని మాత్రమే చూపించడం దారుణం
- తెలంగాణ అస్తిత్వాన్ని భౌగోళిక గుర్తింపుని గుర్తించకపోవడం బీజేపీ అధికారిక విధానమా?

హైదరాబాద్

భారతదేశ చిత్రపటం నుంచి తెలంగాణను తొలగించడం ఏంటని ప్రశ్నించారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. బీజేపీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు మాధవ్ బహుమతిగా ఇచ్చిన మ్యాపులో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ని మాత్రమే చూపించడం దారుణమన్నారు కేటీఆర్. ఇలా తమ చరిత్రను తొలగిస్తే ఇక - మిగతా3లో



## ఈ టైంలో సవరణ ఎందుకు..

- బీహార్ ఓటర్ల జాబితా కేసులో సుప్రీం ప్రశ్న
- ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ చట్టబద్ధంగా జరుగుతున్న విషయాన్ని అంగీకరిస్తున్నామని, కానీ ఎన్నికలకు ముందే ఎందుకు ఈ ప్రక్రియను చేపడుతున్నారు
- ఓటర్ల జాబితా నుంచి పేర్లు కోల్పోయిన వారికి.. తమ పేర్లను జోడించేందుకు సమయం ఉండదు

# స్టాలిన్ చొరవ.. సమసిన మారన్ బ్రదర్స్ గొడవ!

తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ మరోసారి చక్రం తిప్పారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు తలనొప్పిగా మారిన కుటుంబ వివాదాన్ని చక్కదిద్దారు. డీఎంకే పార్టీకి ఇబ్బందికరంగా మారిన మారన్ సోదరుల ఆస్తి గొడవకు ముగింపు పలికారు. సరైన సమయంలో కల్పించుకుని అన్నదమ్ముల వివాదాన్ని పరిష్కరించారు. తమ కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న ద్రవిడర్ కజగం అధ్యక్షుడు కె వీరమణి, హిందూ దినపత్రిక మాజీ సంపాదకుడు ఎన్ రామ్ సహాయంతో మారన్ సోదరుల మధ్య సయోధ్య కుదిర్చారు. మారన్ కుటుంబంతో పాటు డీఎంకేలోనూ అలజడి రేగకుండా కాచుకున్నారు.



**భారీగా దయా'నిధి'**

ఆస్తుల్లో తనకు రావాల్సిన వాటా కోసం అన్న కళానిధి మారన్‌పై కోర్టుకెక్కిన డీఎంకే ఎంపీ దయానిధి మారన్‌కు భారీగానే నిధి దక్కినట్టు తెలుస్తోంది. దాదాపు రూ. 800 కోట్ల నగదు.. అంతే విలువైన చెన్నైలోని ఎలైట్ బోట్ క్లబ్ ప్రాంతంలో ఎకరం భూమిని పొందారని మారన్ కుటుంబం, డీఎంకే ఉన్నత వర్గాలు వెల్లడించినట్టు 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' తెలిపింది. మొత్తానికి దయానిధి మారన్ తాను అనుకున్నది సాధించారని సన్నిహిత వర్గాలు గుసగసలాడుతున్నాయి. ఎందుకంటే ఆస్తుల వివాద పరిష్కారానికి తనకు రూ. 1500 కోట్లు ఇవ్వాలని అంతకుముందు ఆయన డిమాండ్ చేసినట్టు తెలిసింది.

**అసలేంటి గొడవ?**

తన అన్నయ్య కళానిధికి జూన్ ప్రారంభంలో దయానిధి లీగల్ నోటీసు పంపడంతో మారన్ సోదరుల వివాదం బయట ప్రపంచానికి తెలిసింది. సన్ టీవీ నెట్‌వర్క్ షేర్లను అక్రమంగా తన పేరు మీద బదలాయించుకున్నారని దయానిధి ఆరోపించారు. సన్ టీవీ నెట్‌వర్క్ ఒక ప్రైవేట్ కంపెనీగా ఉన్నప్పుడు.. మోసపూరిత వాటా కేటాయింపులు, కార్పొరేట్ దుష్పరిపాలన, ఏకపక్ష నిర్ణయాలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ అన్నపై దావా వేశారు. అయితే దయానిధి రూ.1500 కోట్లు చెల్లించాలని కోరగా, కళానిధి రూ.500 కోట్లు మాత్రమే ఇస్తానని చెప్పడంతోనే ఆస్తుల గొడవ రచ్చకెక్కిందని సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. కాగా, తనపై తమ్ముడు చేసిన ఆరోపణలను కళానిధి కొట్టిపారేశారు. జూన్ 20న స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు అధికారికంగా వివరణ ఇచ్చారు. పబ్లిక్ లిస్టింగ్‌కు ముందు సన్ నెట్‌వర్క్ కంపెనీకి చెందిన లావాదేవీలన్నీ చట్టబద్ధంగానే జరిగాయని తెలిపారు. వ్యక్తిగతంగానే తనపై తప్పుడు ఆరోపణలు చేశారని పేర్కొన్నారు.

**స్టాలిన్ చొరవ.. సమసిన గొడవ**

మారన్ సోదరుల మధ్య ఆస్తుల వివాదం ముదిరి పాకాన పడక ముందే పరిష్కరించాలని భావించిన సీఎం స్టాలిన్.. వారిద్దరి మధ్య సయోధ్య కుదర్చడానికి స్వయంగా రంగంలోకి దిగారు. తాను చేసిన ప్రయత్నం విఫలం కావడంతో ఆయన రూటు మార్చారు. తమ కుటుంబానికి అత్యంత సన్నిహితులైన వీరమణి, ఎన్. రామ్‌లతో మంత్రాంగం నడిపించారు. ఇందులో భాగంగా మూడు దఫాల చర్చలు జరిగాయని.. వాటిలో రెండు వ్యక్తిగతంగా, ఒకటి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగాయి. అయితే అన్నదమ్ముల మధ్య ఒప్పందం కుదిరిన తర్వాత ఈ చర్చలు జరిగినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. 'మొదట మారన్ కుటుంబానికి వీరమణి ఫోన్ చేశారు. ఆ తర్వాత ఇతరులు కూడా చేరారు. జూన్ చివరి వారం నుంచి జూలై మొదటి వారం వరకు మూడు రౌండ్ల చర్చలు జరిగాయి. వివాదం గురించి ఇరు వర్గాలు మీడియాతో మాట్లాడకుండా ఉండాలని, సమస్య పరిష్కార దిశగా ముందుకు సాగాలని మధ్యవర్తులు సూచించార'ని ఆ వర్గాలు తెలిపాయి. ఈ వివాదం కారణంగా డీఎంకే, మారన్ కుటుంబానికి ప్రతిష్టకు కలిగే భంగం.. ఎక్కువ కాలం వ్యాజ్యం కొనసాగడం వల్ల కలిగే నష్టం, కోర్టు ఖర్చుల గురించి కూడా చర్చల్లో పెద్దలు ప్రస్తావించినట్టు సమాచారం.

**వారిద్దరే ఎందుకు?**

మారన్ సోదరుల ఆస్తుల గొడవ పరిష్కారానికి ఎంకే స్టాలిన్ వ్యూహాత్మకంగా రాజకీయ కురువ-ద్ధుడైన వీరమణి, ప్రఖ్యాత జర్నలిస్ట్ ఎన్. రామ్‌లను ఎంచుకున్నారు. ఈ డిసెంబర్‌లో 93వ ఏట అడుగుపెట్టనున్న వీరమణి తమిళ రాజకీయాల్లో అత్యంత సీనియర్ నాయకుడు. అంతేకాదు ద్రవిడ ఉద్యమంలో గౌరవనీయమైన వ్యక్తిగా ఆయన గుర్తింపు ఉంది. ఇంకో కీలక అంశం ఏమిటంటే సన్ నెట్‌వర్క్‌తో ఆయన ఎటువంటి ఆర్థిక లావాదేవీలు లేవు. స్టాలిన్ కుటుంబానికి మాత్రం ఇందులో 20 శాతం వాటా ఉంది. మారన్ కుటుంబానికి బంధువైన సీనియర్ జర్నలిస్ట్ ఎన్ రామ్ సైద్ధాంతికంగా డీఎంకేకు దగ్గరగా ఉన్నారు. మీడియాలో విశ్వసనీయత ఆధారంగా మధ్యవర్తిత్వానికి ఆయనను స్టాలిన్ ఎంచుకున్నారు. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ వివాదం పార్టీకి తలనొప్పిగా మారే అవకాశం ఉందన్న భావనతో పరిస్థితిని చక్కదిద్దడానికి స్టాలిన్ జోక్యం చేసుకున్నారని డీఎంకే నేత ఒకరు వెల్లడించారు.

**వేర్వేరు రంగాల్లో..**

కళానిధి, దయానిధి తండ్రి దివంగత మురసోలి మారన్ కరుణానిధి మేనల్లుడు. డీఎంకే పార్టీ అండతో ఆయన పలు పర్యాయాలు కేంద్ర మంత్రిగా పనిచేశారు. ఆయన బతికున్నంత కాలం మారన్ కుటుంబంలో ఎటువంటి పొరపొచ్చాలు లేవు. ఇద్దరు కుమారులు వేర్వేరు రంగాల్లోకి ప్రవేశించి ముందుకెళ్లారు. కళానిధి 1993లో సన్ టీవీని ప్రారంభించి ప్రాంతీయ టెలివిజన్ మార్కెట్‌లో తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు. దయానిధి మారన్ తండ్రి వారసత్వాన్ని ఉపయోగించుకుని రాజకీయాల్లోకి ప్రవేశించి 2000లో కేంద్ర టెలికాం మంత్రి అయ్యారు.

**అక్కడి నుంచే మొదలు..**

మారన్ కుటుంబ వార్తాపత్రిక దినకరన్ కార్యాలయంపై 2007లో డీఎంకేలోని ఎంకే అళగిరి మద్దతుదారులు దాడికి పాల్పడడం అప్పట్లో సంచలనంగా మారింది. స్టాలిన్‌ను కరుణానిధి రాజకీయ వారసుడిగా పేర్కొంటూ దినకరన్ పేపర్‌లో రావడంతో కోపోద్రిక్తులైన అళగిరి మద్దతుదారులు హింసాత్మకంగా స్పందించారు. పెద్ద కొడుకునైన తనను కాదని స్టాలిన్‌ను రాజకీయ వారసుడిగా వర్ణించడంతో అళగిరి అగ్గిమీద గుగ్గిలమయ్యారు. అప్పటి నుంచి వీరిద్దరి మధ్య దూరం కొనసాగుతోంది. తాజాగా మారన్ సోదరులు ఆస్తుల కోసం కోర్టుకెక్కడం తమిళ పాలిటిక్స్‌లో హాట్ టాపిక్ అయింది.

# గుండెపోటు భయాలు.. ఆ ఒక్క ఆస్పత్రికే వేలమంది క్యూ!

గుండె సమస్యలతో ఉన్నట్లుండి కుప్పకూలి చనిపోతున్న ఉదంతాలు నిత్యం చూస్తున్నాం. కర్ణాటక హసన్ జిల్లాలో 40 రోజుల వ్యవధిలో 23 మంది మరణించారు. ఈ కథనాలు జనాలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. అందునా 25-40 మధ్యవయసున్న వాళ్లే ఎక్కువగా ఉండడం తీవ్ర చర్చనీయాంశమైంది. దేశంలో నిత్యం ఏదో ఒక మూల హఠాన్మరణం ఘటన చోటు చేసుకుంటోంది. అప్పటిదాకా సంతోషంగా ఉన్న వ్యక్తులు, ఎలాంటి అరోగ్య సమస్యలు లేని వ్యక్తులు.. ఒక్కసారిగా కుప్పకూలిపోయి ప్రాణం విడుస్తున్నారు. హార్ట్ ఎటాక్, కార్డియాక్ అరెస్టులతోనే వాళ్లు చనిపోతున్నారని డాక్టర్లు సైతం నిర్ధారిస్తున్నారు. దీంతో కొందరు ఎలాంటి లక్షణాలు లేకున్నా పోటు తప్పదని అంచనాకి వస్తున్నారు. ఈ క్రమంలో.. ముందస్తుగా గుండె పరీక్షలు చేయించుకుంటున్నారు. కర్ణాటక మైసూర్‌లోని ప్రముఖ జయదేవ ఆస్పత్రికి గత మూడు నాలుగు రోజుల నుంచి వేలమంది జనం క్యూ కట్టారు. ఓపీ కోసం వేకువ జాము నుంచే ఆస్పత్రి వద్ద పడిగాపులు పడుతున్నారు. క్యూ లైన్‌లలో కిక్కిరిసిపోయి కనిపిస్తున్నారు. మైసూర్‌తో పాటు బెంగళూరు బ్రాంచ్ ముందు కూడా ఇదే పరిస్థితి. జయదేవ ఆస్పత్రి ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే అటానమస్ ఆస్పత్రి.



అయితే మీడియా కథనాలతో, సోషల్ మీడియా ప్రచారాలతో ఆందోళన చెందవద్దని జయదేవ ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ కేఎస్ సదానంద ప్రజలకు సూచిస్తున్నారు. "జనాలు అంతా ఒక్కసారిగా ఇక్కడికి ఎగబడినంత మాత్రాన.. సమస్య పరిష్కారం కాదు. కేవలం పరీక్షలు చేసుకున్నంత మాత్రాన ఎలాంటి ప్రయోజనం ఉండదు. ఇలాంటి ఊహాగానాలకు అతిగా స్పందించొద్దు. మీరు ఆస్పత్రులకు ఎగబడడం వల్ల.. అత్యవసర పరిస్థితి ఉన్న రోగులకు చికిత్సలో అంతరాయం కలగవచ్చు. కేవలం వైద్య పరీక్షలు చేయించుకున్న మాత్రాన సమస్య పరిష్కారం కాదు. మంచి ఆహారం తీసుకుంటూ నిత్యం వ్యాయామాలు చేస్తూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలి" అని సూచించారాయన. హసన్ మరణాలపై ఆందోళన వ్యక్తం చేసిన కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య.. వీటిపై విచారణకుత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఆ కమిటీ తాజాగా నివేదికను సమర్పించింది కూడా. అదే సమయం కోవిడ్ వ్యాక్సిన్‌ల పనితనం గురించి ఆయన అనుమానాలు వ్యక్తం చేయగా.. కేంద్ర ఆరోగ్య శాఖ పలు అధ్యయనాలను ప్రస్తావిస్తూ ఆ ఆరోపణలను కొట్టిపారేసింది.

# ఇందిరాగాంధీపై శశిథరూర్ సంచలన వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ సీనియర్ నేత, తిరువనంతపురం ఎంపీ శశిథరూర్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇందిరా గాంధీ హయాంలో విధించిన ఎమర్జెన్సీని చీకటి అధ్యాయంగా అభివర్ణిస్తూ.. దాని నుంచి నేర్చుకోవాల్సిన పాఠాలు అంటూ ఓ విమర్శనాత్మక వ్యాసాన్ని రాశారాయన. ఎమర్జెన్సీ ఒక చీకటి అధ్యాయం. ఆ చీకటి అధ్యాయం నుంచి నేర్చుకోవాల్సిన విషయాలు ఎన్నో ఉన్నాయి. ఎమర్జెన్సీ కాలంలో స్వేచ్ఛను హరించారు. ప్రజాస్వామ్యాన్ని అణచివేసే ప్రయత్నం చేశారు.. అంటూ ఎమర్జెన్సీకి యాభై ఏళ్లు పూర్తైన సందర్భంగా "ప్రాజెక్టు సిండికేట్" అనే వెబ్‌సైట్‌లో ఆయన తన అభిప్రాయం వ్యక్తం చేస్తూ ఓ ఆర్టికల్ రాశారు. దేశంలో అంతర్గత గందరగోళాన్ని తొలగించడానికి, బయటి నుంచి వచ్చే ముప్పును ఎదుర్కోవడానికి ఎమర్జెన్సీలాంటి కఠినమైన నిర్ణయం తప్పనిసరి అని ఆమె(ఇందిరాగాంధీని ఉద్దేశించి..) భావించారు. కానీ, ఈ విధానాలు ప్రజలను తీవ్ర భయాందోళనకు గురిచేశాయి, అణచివేతతో కూడిన స్థితిలోకి ప్రజలను నెట్టివేశాయి అని పేర్కొన్నారాయన. అయితే స్వేచ్ఛను అణచివేసే చర్యలు ఎంత ప్రమాదకరమో, ప్రజల జీవితాలపై ఎంత తీవ్ర ప్రభావం చూపవచ్చో అంటూ నాటి ఇందిరా గాంధీ ప్రభుత్వ విధానాలను ప్రస్తావిస్తూ ఆయన పలు విమర్శలు చేశారు. 21 నెలలపాటు పౌర హక్కులను హరించి వేశారు. సంజయ్ గాంధీ నేతృత్వంలో బలవంతపు వాసెక్టమీ కార్యక్రమాలు.. పేద ప్రాంతాల్లో అమలయ్యాయి. ఢిల్లీలోని స్లమ్ ప్రాంతాలు కూల్చివేయబడ్డాయి, వేలాది మంది నిరాశ్రయులయ్యారు. న్యాయవ్యవస్థ ఒత్తిడికి లోనై, హేబియస్ కార్పస్ హక్కును కూడా నిలిపివేసింది. ఈ చర్యలు "అత్యధిక అధికారాన్ని" ఎలా దుర్వినియోగం చేయవచ్చో చూపించాయి. ఫలితంగా.. ప్రజలు 1977 ఎన్నికల్లో ఇందిరా గాంధీని తిరస్కరించి ప్రజాస్వామ్యాన్ని తిరిగి స్థాపించారు అని తన వ్యాసంలో థరూర్ పేర్కొన్నారు. ఎమర్జెన్సీని కేవలం భారత చరిత్రలోని చీకటి అధ్యాయంగా గుర్తుపెట్టుకోవడం కాకుండా, దాని నుంచి పాఠాలను నేర్చుకోవాలి. ప్రజాస్వామ్యం అనేది అది అపురూపమైన వారసత్వం. దానిని నిరంతరం పోషిస్తూ.. పరిరక్షించుకోవాలి. ఈ విషయం ప్రజలందరికీ ఎప్పటికీ గుర్తుండేలా చేయాలి. చరిత్ర మళ్లీ పునరావృతం కాకుండా.. స్వేచ్ఛను నిలుపుదాం అంటూ వ్యాసం ముగించారాయన. 2020లో.. జీ23 పేరిట విడుదలైన లేఖ కాంగ్రెస్‌లో కలకలం రేపింది. శశిథరూర్ సహా 23 మంది సీనియర్ నేతలు 'కాంగ్రెస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం, స్థిరమైన నాయకత్వం' కోరుతూ లేఖ రాయడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఇది సోనియా గాంధీ కుటుంబానికి వ్యతిరేకంగా(మరీ ముఖ్యంగా అప్పటి రాహుల్ గాంధీ నాయకత్వాన్ని వ్యతిరేకిస్తూ..) తిరుగుబాటు లాగా భావించారంతా. అప్పటి నుంచి థరూర్‌కు, కాంగ్రెస్ అధిష్టానానికి గ్యాప్ మొదలైంది. తిరిగి.. 2022లో కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల సమయంలో ఈ గ్యాప్ మరోసారి బయటపడింది. శశిథరూర్ మల్లికార్జున ఖర్గేకు వ్యతిరేకంగా అధ్యక్ష పదవికి పోటీ చేశారు. ఖర్గే గెలిచినా, థరూర్‌కు 1,000కి పైగా ఓట్లు వచ్చాయి. అయితే పార్టీలో అంతర్గతంగా థరూర్‌కు మద్దతు ఉన్నట్లు ఈ ఎన్నిక స్పష్టం చేసింది. 2023-24.. శశిథరూర్ ఈ మధ్యకాలంలో తరచూ పార్టీ లైన్‌కు భిన్నంగా మాట్లాడారు. మరీ ముఖ్యంగా విదేశాంగ విధానాలపై ఆయన చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో కలకలం రేపాయి. కొన్ని సందర్భాల్లో ఆయన ప్రధానమంత్రి మోదీని ప్రశంసించడం పార్టీ నేతల్లో అసంతృప్తికి దారి తీసింది. అదే సమయంలో థరూర్ అభిప్రాయాల ఆధారంగానే కాం?గ్రెస్‌పైకి బీజేపీ విమర్శలు ఎక్కుపెట్టింది. 2025లో.. ఆపరేషన్ సిందూర్ తర్వాత కాంగ్రెస్‌కే షాకిస్తూ ఆ పార్టీ ఎంపీ శశిథరూర్‌ను అఖిలపక్ష బృందంలో ఎంపిక చేసింది బీజేపీ. పలు దేశాల సమావేశాల్లో థరూర్ మోదీ నాయకత్వంపై ప్రశ్నలు గుప్పించారు. ఇది ఆయన కొందరు కాంగ్రెస్ నేతలతో సోషల్ మీడియా వేదికగా వాగ్వాదానికి కారణమైంది. విదేశాల నుంచి తిరిగి వచ్చాక పార్టీ అధిష్టానంతో విభేదాలున్నాయని అంగీకరిస్తూనే.. అవి నాలుగు గోడల మధ్య చర్చించుకునే విషయమని కేరళలో స్పష్టం చేశారు. ఆపై ది హిందూ కోసం ఆయన రాసిన ఓ కథనం.. ప్రధాని మోదీ శక్తి, చురుకుదనం భారతదేశానికి ప్రధాన ఆస్తి అంటూ చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌కు మరింత ఆగ్రహం తెప్పించాయి. అయితే ఇవేవీ తాను బీజేపీలో చేరతాననే సంకేతాలు మాత్రం కాదని శశిథరూర్ తాజాగా స్పష్టత ఇచ్చారు. అయితే థరూర్‌పై చర్యలు ఉండబోవని కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు ఖర్గే ఇప్పటికే స్పష్టం చేశారు. ఈలోపే ఏకంగా ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీని తప్పుబడుతూ మరో వ్యాసం రాయడం తీవ్ర చర్చనీయాంశమైంది. దీనిపై కాంగ్రెస్ అధిష్టానం ఎలా స్పందిస్తుందో చూడాలి.

## 100 ఏళ్లైనా.. ఏఐతో ఆ స్థానాలను భర్తీ చేయడం సాధ్యం కాదు



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రస్తుతం ఎవరి నోట విన్నా ఇదే మాట. ఇప్పుడు ఇది సర్వాంతర్యామి అయిపోయింది. ఎలాంటి ప్రశ్నకైనా ఇట్టే సమాధానం ఇస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా అన్ని రంగాల్లోనూ ఏఐ విస్తరించింది. దీంతో ఏఐ వినియోగం భారీగా పెరిగిపోయింది. ఇది మంచి విషయమే అయినప్పటికీ.. ఏఐ కారణంగా ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగుల్లో అభద్రతా భావం పెరిగిపోయింది. చాలా కంపెనీలు తమ ఉద్యోగులకు లేఆఫ్‌లు ప్రకటించి.. వారి స్థానాల్లో ఏఐని వినియోగిస్తున్నారు. దీంతో ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ఆందోళనల వేళ మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ కీలక వ్యాఖ్యలు చేశారు. వచ్చే 100 ఏళ్లైనా ప్రోగ్రామర్లను ఏఐ భర్తీ చేయలేదన్నారు. అంతేకాదు కోడింగ్ పైనా ఏఐ ప్రభావం ఉండదని చెప్పారు. ఓ ఇంటర్వ్యూలో బిల్‌గేట్స్ మాట్లాడుతూ.. 'కృత్రిమ మేధ అనేది ప్రోగ్రామింగ్ రంగంలో మనిషికి ప్రత్యామ్నాయం కాలేదు. కేవలం ఒక సహాయకారిగా మాత్రమే పనిచేస్తుంది. ప్రోగ్రామింగ్‌లో క్లిష్టమైన సమస్యగా భావించేదాన్ని క్రియేటీవ్‌గా పరిష్కరించాల్సి ఉంటుంది. ప్రోగ్రామింగ్‌లో అది సవాలుతో కూడుకున్న విషయం. మానవ మేధస్సు లేని యంత్రాలు (ఏఐ) అలా చేయలేవు' అని బిల్‌గేట్స్ వ్యాఖ్యానించారు. అదేవిధంగా కోడింగ్ అంటే కేవలం టైపింగ్ చేయడం కాదని.. చాలా లోతుగా ఆలోచించాల్సి ఉంటుందని బిల్‌గేట్స్ తెలిపారు. ఈ మేరకు భవిష్యత్తులో కోడింగ్, ఎనర్జీ మేనేజ్‌మెంట్, బయాలజీ రంగాలకు ఆటోమేషన్ ముప్పు తక్కువేనని ఆయన అంచనా వేశారు.

## సీఎంగా ఐదేళ్ల పాటు తానే కొనసాగుతా



**ఇంటర్నెట్‌డెస్క్:** కర్ణాటకలో సీఎంగా ఐదేళ్ల పాటు తానే కొనసాగుతానని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తేల్చి చెప్పారు. ఓ ఆంగ్ల ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో నాయకత్వ మార్పుపై వస్తున్న ఊహాగానాలను ఆయన కొట్టిపారేశారు. డీకే శివకుమార్‌ను ముఖ్యమంత్రిగా చేయడం కోసం తనను కాంగ్రెస్ హైకమాండ్ రాజీనామా చేయమని కోరినట్లు జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమన్నారు. "సీఎంగా నేను ఐదేళ్లూ ఉంటాను. ఈ విషయాన్ని నేను ఎప్పుడో స్పష్టంగా చెప్పాను. జులై 2వ తేదీన కూడా దీనిపై ప్రకటన విడుదల చేశాను. ఆ సమయంలో డీకే శివకుమార్ కూడా అక్కడే ఉన్నారు. ఆయన కూడా పోటీదారే. అందులో తప్పు ఏముంది. 'కుర్చీ ఇప్పుడు ఖాళీగా లేదు' అని ఆయనే అన్నారు" అని పేర్కొన్నారు. నాయకత్వం రొటేషన్‌పై పార్టీ హైకమాండ్ టైమ్‌లైన్ లేదా సూచనలు ఏమీ చేయలేదని సిద్ధరామయ్య వెల్లడించారు. రెండున్నర సంవత్సరాల అంశాన్ని ఎవరూ నిర్ణయించలేదన్నారు. హైకమాండ్ నిర్ణయం తీసుకొంటే తమకు చెబుతుందని.. వాటిని తాము అమలుచేస్తామన్నారు. ఇక పార్టీ నాయకత్వంపై కాంగ్రెస్ రణ్‌దీప్ సుర్జేవాలా ఎటువంటి ప్రశ్నలు లేవనెత్తలేదన్నారు. డీకే శివకుమార్‌కు మద్దతు ఇచ్చే కొద్దిమంది ఎమ్మెల్యేలు ఉన్నారని అంగీకరించారు. తాను నేడు రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ కోరానని అయితే ఇప్పటివరకు దానిపై ఎలాంటి కన్ఫర్మేషన్ లేదని చెప్పారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి ఆరోగ్యకరంగానే ఉందని సిద్ధరామయ్య వివరించారు. నిధుల కొరత లేదని.. తగినన్ని నిల్వలు ఉన్నాయన్నారు. ఒకట్రెండ్ ఇబ్బందులు ఉండొచ్చని.. అంతమాత్రాన రాష్ట్ర ప్రభుత్వం దివాలా తీసినట్లు కాదని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు ఏజెన్సీలను దుర్వినియోగం చేస్తోందని చెప్పారు. ముఖ్యంగా ఈడీ కాంగ్రెస్ నాయకులనే టార్గెట్ చేస్తోందని ఆరోపించారు. మరోవైపు ముఖ్యమంత్రిగా కొనసాగుతానని సిద్ధరామయ్య ప్రకటించిన అనంతరం తాను చేసేది ఏమీలేదని ఆ పీఠంపై కన్నేసిన డీకే శివకుమార్ నిర్వేదంతో వ్యాఖ్యలు చేశారు. తాను చేసిన ప్రయత్నాలు విఫలమైనా, ప్రార్థనలు విఫలం కాలేదని ఆయన పేర్కొన్నారు. రెండున్నరేళ్ల అనంతరం ముఖ్యమంత్రి పీఠం విషయంలో మార్పు ఉంటుందని కాంగ్రెస్ అధికారంలో వచ్చినప్పటినుంచి ప్రచారం జరుగుతోంది.

## ఈ టైంలో సవరణ ఎందుకు..



**న్యూఢిల్లీ:** బీహార్‌లో చేపడుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై ఇవాళ సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఎన్నికల సంఘాన్ని అత్యున్నత న్యాయస్థానం కఠినంగా ప్రశ్నించింది. ఈ టైంలో ఓటర్లకు చెందిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ చేయాల్సిన అవసరం ఏమి వచ్చిందని అడిగింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితా సవరణ అవసరం ఏంటని కోర్టు ప్రశ్నించింది. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ చట్టబద్ధంగా జరుగుతున్న విషయాన్ని అంగీకరిస్తున్నామని, కానీ ఎన్నికలకు ముందే ఎందుకు ఈ ప్రక్రియను చేపడుతున్నారని ఎన్నికల సంఘాన్ని జస్టిస్ సుధాన్షు దులియా ప్రశ్నించారు. మీరు చేపట్టే ప్రక్రియతో సమస్య లేదని, కేవలం ఈ సమయంలో ఎందుకు చేస్తున్నారన్నదే సమస్య అని కోర్టు పేర్కొన్నది. ఓటర్ల జాబితా నుంచి పేర్లు కోల్పోయిన వారికి.. తమ పేర్లను జోడించేందుకు సమయం ఉండదని కోర్టు తెలిపింది. ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితా సవరణ పేరుతో పేద ఓటర్లను జాబితా నుంచి తొలగిస్తున్నారని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆందోళన కూడా చేపట్టాయి. ఓటర్ల జాబితా సవరణ సమయంలో.. ప్రజల వద్ద ఉన్న ఆధార్, రేషన్ కార్డు,ఓటరు కార్డులను పరిగణలోకి తీసుకోవాలని సుప్రీంకోర్టు తన ఆదేశాల్లో స్పష్టం చేసింది. ఓటర్లను రీవెరిఫై చేసే సమయంలో ఈ మూడు కార్డులను గుర్తింపుగా తీసుకోవాలని కోర్టు సూచించింది. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై స్టే విధించడం లేదని కోర్టు చెప్పింది. జూలై 28వ తేదీన మళ్లీ ఈ కేసులో విచారణ జరగనున్నది.

## తీగుల్ గ్రామంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి

# పలు ఆకస్మిక తనికీలు



**సిద్దిపేట :** జగదేవ్ పూర్ మండలంలోని తీగుల్ గ్రామంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి పలు ఆకస్మిక తనికీలు నిర్వహించారు. తీగుల్ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా తనికి చేశారు. డ్యూటీ డాక్టర్ లేరని ఆరా తియ్యగా వట్టిపల్లి గ్రామంలో మెడికల్ క్యాంపు కు వెళ్ళారని సిబ్బంది కలెక్టర్ కి తెలిపారు. రోగులకు వైద్యం అందించడం డాక్టర్ ముఖ్యమైన విధి అని నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వైద్యులు రోజు 9 గంటలకే ఆసుపత్రిలో ఉంటూ రోగులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, వైద్యం విషయంలో ఎలాంటి రాజీ పడవద్దని, లోపల అన్ని పరికరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. అన్ని రిజిస్టర్ వెరిఫై చేశారు. సీజనల్ వ్యాధులకు సంబంధించి అన్ని సదుపాయాలు పిఎచ్సి లో ఉంచుకోవాలని తెలిపారు. గత కొంత కాలంగా షార్ట్ సర్క్యూట్ వల్ల కరెంట్ కలెక్షన్ లేదని తెలుపగా విద్యుత్ శాఖ అధికారులు తాత్కాలికంగా కనెక్షన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని తాసిల్దార్ కు తెలిపారు. తరచూ పిహెచ్సి ని మండల అధికారులు పర్యటించి రోగులకు అందించే సేవలను తనిఖీ చేయాలని ఆదేశించారు. పీహెచ్ సీ ప్రాంగణం పరిసర ప్రాంతాల్లో చెట్లపొదులు తొలగించి శుభ్రంగా చేయాలని పంచాయతీ సెక్రెటరీ ఆదేశించారు.తీగుల్ గ్రామంలో నీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మధ్యాహ్న భోజన ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. వంట చేయడంలో ఆలస్యం, వాటర్ వృధాగా పోయిన పట్టించుకోవట్లేదని వంట సిబ్బంది నిర్లక్ష్యం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం రోజు వంట చేయట్లేదని ప్రిన్సిపల్ వంట సిబ్బందిపై కంప్లైంట్ చేయగా మెనూ ప్రకారం వండకపోతే విధుల్లో నుండి తొలగించాలని నిర్లక్ష పనులు సమాధానాలు తెలిపితే ఉపేక్షించేది లేదని ప్రిన్సిపల్ కి తెలిపారు. ఎంపీడీవో రోజు మానిటరింగ్ చెయ్యాలని ఈ రోజు మెనూ పాటించట్లేదని స్కూల్ రిజిస్టర్ లో రాసి ఆ రిపోర్ట్ ను డిఈఓ కీ పంపించాలని తెలిపారు.తీగుల్ గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం లో మెనూ ప్రకారం పెట్టట్లేదని ప్రిన్సిపల్ పై అగ్రహం వ్యక్తం చేశారు. పిల్లల పట్ల సహృదయ భావంతో వెలగాలని తన సొంత పిల్లల్లాగా చూసుకోవాలని తెలిపారు. నాలుగో తరగతిలో ఏకలవ్య పాఠం గూర్చి పిల్లలను పలు ప్రశ్నలు అడిగారు. గురువులు చెప్పిన పాఠాలు శ్రద్ధగా విని చదవాలని సబ్జెక్టును అర్థం చేసుకోవాలని సూచించారు. రిజిస్టర్ లో మెనూ పాటించట్లేదని రిపోర్టు రాయాలని ఎంపీడీవోకు సూచించారు. 21 సంవత్సరాల నుండి టీచర్ గా పనిచేసి పదవీ విరమణ పొందిన బాల్ రెడ్డి ఇంకను పాఠశాలలో బోధిస్తున్నందుకు భావితరాలకు మీరు ఒక ఆదర్శమని వారిని అభినందించారు.తిగుల్ గ్రామంలోనీ అంగన్వాడీ కేంద్రం-1 నీ జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. మెనూ ప్రకారం అంగన్వాడి పిల్లలకు మరియు గర్భిణీ స్త్రీలకు భోజనం అందించాలని ఆయాకు తెలిపారు. రిజిస్టర్ వెరిఫై చేశారు. పిల్లలను ప్రేమగా చూడాలని పూర్వ ప్రాథమిక పాఠశాల లో అందించాల్సిన పాటలు, చాట్స్ ఇలా అన్ని యాక్టివిటీస్ పిల్లలతో చేయించాలని టీచర్ కి తెలిపారు.కలెక్టర్ వెంట తహసిల్దార్ నిర్మల, ఎంపీడీవో రామిరెడ్డి, పోలీసు మరియు గ్రామపంచాయతీ అధికారులు తదితరులు ఉన్నారు.

# సమ్మెతో సింగరేణి 76 కోట్ల నష్టం



**కరీంనగర్ :** కరీంనగర్ లో సింగరేణి కార్మికులు సమ్మెకు పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా ఒకరోజు టోకెన్ సమ్మె చేపట్టనున్నారు. కేంద్ర ప్రభుత్వం విధానాలకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలు ఈ సమ్మెకు పిలుపునిచ్చాయి. ఈ సమ్మె కారణంగా సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి బ్రేక్ పడనుంది. ఒక్కరోజు సమ్మెతో దాదాపు 76 కోట్ల రూపాయల విలువ చేసే బొగ్గు ఉత్పత్తికి నష్టం కలగనుంది.కేంద్ర ప్రభుత్వం విధానాలను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలన్నీ ఒక్కరోజు టోకెన్ సమ్మెకు పిలుపునిచ్చాయి. ఇందులో భాగంగా సింగరేణిలోనూ సమ్మెకు పిలుపునిచ్చాయి. ఇప్పటికే కార్మిక సంఘాలన్నీ సింగరేణిలో సమావేశం నిర్వహించారు. ఒక్కరోజు సమ్మె విజయవంతం కోసం కార్మిక సంఘాలన్నీ గేట్ మీటింగ్ నిర్వహించాయి. విస్తృతంగా ప్రచారం చేశాయిమార్చి 20న సమ్మె చేయాలని అనుకున్నా.. యుద్ధం కారణంగా ఈ సమ్మె వాయిదా పడింది. గేట్ మీటింగ్ ల ద్వారా కార్మిక సంఘాలన్నీ విస్తృతంగా ప్రచారం చేశాయి. ఒక్కరోజు సమ్మెతో సింగరేణిపై పెనుభారం పడనుంది. దీంతో సమ్మెకు వెళ్లొద్దని సింగరేణి యాజమాన్యం కోరుతోంది. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం సమ్మెకు వెళ్తామని కార్మిక సంఘాలు చెబుతున్నాయి.సింగరేణి వ్యాప్తంగా ఉన్న ఐదు జాతీయ సంఘాల్లో నాలుగు ఎంఐటియుసి, ఏఐటియుసి, ఐఎన్టియుసి, సిఐటియు.. సమ్మెకు మద్దతు తెలిపాయి. బీజేపీ అనుబంధ సంఘం బిఎంఎస్ మాత్రం సమ్మెకు దూరంగా ఉంది. బీఆర్ఎస్ కు అనుబంధంగా ఉన్న తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కూడా సమ్మెకు మద్దతు తెలిపింది. విప్లవ కార్మిక సంఘాలు సైతం సింగరేణి సమ్మెకు మద్దతు ప్రకటించాయి. కార్మికుల హక్కులు రక్షించుకోవాలంటే సమ్మెలో కచ్చితంగా పాల్గొనాలని కార్మిక సంఘాలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి. రేపటి సమ్మెను విజయవంతం చేసే దిశగా కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా, ముమ్మరంగా ప్రచారం చేశాయి.సమ్మె చేస్తే సింగరేణిపై పెను భారం పడే అవకాశం ఉంది. ఒక్కరోజు సమ్మెతో దాదాపు 76 కోట్ల రూపాయల విలువైన బొగ్గు ఉత్పత్తికి నష్టం జరుగుతోంది. సమ్మెలో పాల్గొనే కార్మికవర్గానికి కూడా వేతన రూపంలో కొంత నష్టం జరుగుతుంది. దాదాపు 13 కోట్లు నష్టపోవాల్సి వస్తుంది. ఒక్కరోజు సమ్మెతో 1.92 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడుతుంది. ఈ రకంగా సింగరేణిపై పెను భారం పడుతుంది కాబట్టి.. ఎట్టి పరిస్థితుల్లో కార్మిక వర్గం సమ్మెలో పాల్గొనకుండా యాజమాన్యానికి సహకరించాలని, ఉత్పత్తిపై ఫోకస్ చేయాలని సింగరేణి యాజమాన్యం చెబుతున్నా.. కార్మిక సంఘాలు మాత్రం ససేమిరా అంటున్నాయి.

# సిగాచి పరిశ్రమ మరిన్ని కష్టాలు



**హైదరాబాద్ :** పాశమైలారంలోని సిగాచీ రసాయన పరిశ్రమలో ప్రమాదానికి యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని ప్రాథమిక విచారణలో తేలింది. నిన్న నేషనల్ డిజాస్టర్ మేనేజ్ మెంట్ అథారిటీ బృందం కూడా పరిశీలించి ఇదే రకమైన అనుమానాలను వ్యక్తం చేసింది. ఎన్ఎండీఏ బృందం పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమను పరిశీలించిన అనంతరం ప్రమాదం జరిగిన స్థలంతో పాటు ఇంత మంది మరణానికి గల కారణాలను కూడా తెలుసుకునే ప్రయత్నం చేసింది. సిగాచీ పరిశ్రమ ప్రమాదంలో మొత్తం 44 మంది మరణించారు. ఇంత పెద్ద దుర్ఘటన ఫార్మా పరిశ్రమ చరిత్రలోనే లేకపోవడంతో షనల్ డిజాస్టర్ మేనేజ్ మెంట్ అథారిటీ బృందం కూడా రంగంలోకి దిగింది. రసాయన పరిశ్రమలను ఎలా నిర్వహణ చేస్తున్నారో అక్కడ పనిచేసిన అధికారులను అడిగి తెలుసుకుంది. వారిని ప్రశ్నలతో ఉక్కిరి బిక్కిరి చేసింది. ఇప్పటికే మరణించిన కార్మికుల కుటుంబాలు పాత కాలం మిషనరీని వాడుతున్నారని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడంతో ఆ దిశగా కూడా విచారణ చేపట్టింది. రసాయన పరిశ్రమల్లో ఎప్పటి కప్పుడు యంత్ర సామగ్రిని ఆధునీకీకరించాల్సిన అవసరం ఉన్నప్పటికీ యాజమాన్యం నిర్లక్ష్యం ప్రదర్శిస్తూ ఇంత పెద్ద ప్రమాదానికి కారణమయింది అని ప్రాథమికంగా అభిప్రాయపడినట్లు తెలిసింది. ప్రమాదానికి రియాక్టర్ పేలడమే కారణమని తొలుత భావించినా మరేదైనా కారణం ఉందా? అన్న కోణంలో కూడా షనల్ డిజాస్టర్ మేనేజ్ మెంట్ అథారిటీ బృందం దర్యాప్తు చేసింది. అధికారులను విచారించిన మీదట సిగాచీ పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగినట్లు నిర్ధారించినట్లు .అధికారులు కూడా సక్రమంగా సమాధానాలు ఇవ్వకపోవడంతో వారికి ఉన్న అవగాహనపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి సంబంధించిన నివేదికను షనల్ డిజాస్టర్ మేనేజ్ మెంట్ అథారిటీ బృందం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సమర్పించనుంది. ఇప్పటికే పరిశ్రమను మూడు నెలల పాటు మూసివేయడంతో మళ్లీ ప్రారంభిస్తే ఎలాంటి చర్యలు తీసుకోవాలన్నది కూడా సూచిం చే అవకాశాలున్నాయి. ఇక సిగాచీ పరిశ్రమ ప్రమాదంలో ఏడుగురు జాడ ఇంత వరకూ తెలియలేదు. శిధిలాల్లో లభ్య మైన మానవ శరీర భాగాలతో కుటుంబ సభ్యుల రక్తనమూ నాలతో డీఎన్ఏ పరీక్షలు నిర్వహించినప్పటికీ సరిపోలక పోవడంతో ఆ ఏడుగురు జాడ కోసం మాత్రం ఇంకా అన్వేషణ కొనసాగుతూనే ఉంది.

## కల్తీకల్లు మృతుల కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం ఇవ్వాలి

**హైదరాబాద్:** కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.10 లక్షలు, బాధితులకు రూ.లక్ష చొప్పున పరిహారం ఇవ్వాలని భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. "కల్తీ కల్లు ఘటనలో అనధికారికంగా ఆరుగురు మృతి చెందారు. ఒకటి రెండు సీసాల కల్లు తాగిన వారి కిడ్నీలు దెబ్బతిన్నాయి. కల్తీ కల్లులో సైకో ట్రాఫిక్ సబ్ స్టన్స్ కలిపినట్టు స్పష్టంగా తెలుస్తోంది. ఎక్సైజ్ శాఖ కల్లు కాంపౌండ్ వారితో కుమ్మక్కైంది. ఈ ఘటన మొదటిసారి కాదు.. గతంలోనూ వెలుగు చూశాయి. ఎక్సైజ్ అధికారులు రోజూ కల్లు కాంపౌండ్‌లలో తనిఖీలు చేయాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వంచర్యలు తీసుకోవాలి" అని రామచందర్‌రావు అన్నారు

## 'మీకు మేం ముఖ్యమో? కొండా ఫ్యామిలీ ముఖ్యమో? తేల్చుకోండి?'

-మొదటిపేజీ తరువాయి

తేల్చి చెప్పారు.మీకు మేము ముఖ్యమో..కొండా ఫ్యామిలీ ముఖ్యమో తేల్చాలంటూ అధిష్టానికి ఎమ్మెల్యేలు సూచించారు. మరోవైపు,క్రమశిక్షణ కమిటీ సమావేశంపై మల్లు రవి మాట్లాడారు. వరంగల్ నేతల పంచాయితీపై చర్చించాం. ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు వారి అభిప్రాయాలు చెప్పారు. వరంగల్ నేతలతో మరోసారి భేటీ అవుతామని అన్నారు. వరంగల్ కాంగ్రెస్‌లో చిచ్చు రాజేసిన కొండా మురళి కామెంట్స్ వివాదం వివాదం చిలికి చిలికి గాలివానలా మారింది. ఇప్పటికే తమను కించ పరుస్తూ కొండా మురళి చేసిన వ్యాఖ్యల వ్యవహారంలో ఆయనపై చర్యలు తీసుకోవాలంటూ వరంగల్ కాంగ్రెస్ నేతలు అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. దీంతో క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి.. వివాదంపై వివరణ ఇవ్వాలంటూ కొండా మురళికి నోటీసులు జారీ చేశారు. దీంతో క్రమశిక్షణ కమిటీకి వివరణ ఇవ్వాల్సిన కొండా మురళి ఊహించని విధంగా వ్యవహరించారు. గత నెలలో భారీ అనుచరగణంతో ర్యాలీగా గాంధీభవన్‌కు నేరుగా పీసీసీ క్రమశిక్షణ కమిటీతో సమావేశమ య్యారు. కమిటీ చైర్మన్ మల్లురవి, సభ్యులు శ్యామోహన్, జి.వి.రామకృష్ణ, కమలాకర్‌రావులతో గంటన్నరకు పైగా సమావేశమయ్యారు. ఆ సమావేశంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న పరిణామాలపై ఆయన ఆరు పేజీల లేఖను క్రమశిక్షణ కమిటీకి అందించారు. ఆ లేఖలో పేర్కొన్న అంశాలు ఇప్పుడు సంచలనంగా మారాయి. ఈ క్రమంలో.. వరంగల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు క్రమశిక్షణ కమిటీ సమావేశానికి హాజరు కావాలంటూ పార్టీ అధిష్టానం పిలుపునిచ్చింది. ఈ మేరకు ఇవాళ వరంగల్ నేతలు క్రమశిక్షణ కమిటీ సమావేశానికి హాజరయ్యారు.

## కూకట్‌పల్లి కల్తీ కల్లు కాటుకు ఐదుగురు బలి..

-మొదటిపేజీ తరువాయి

దేవదాస్, కృష్ణయ్యకు డయాలసిస్ చేయాలని నిర్ణయించారు. మరో బాధితుడు మోనప్పను వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనలో కల్తీ కల్లు నిర్వాహకులపై బాలానగర్ అబ్కారీ ఠాణాలో 5 కేసులు, కెపీహెచ్?బీ పోలీస్‌స్టేషన్‌లో 2 కేసులు నమోదయ్యాయి. చింతకిబ్ధి నగేష్ గౌడ్, బట్టి శ్రీనివాస్ గౌడ్, టి. శ్రీనివాస్ గౌడ్, కె. కుమార్ గౌడ్, తీగల రమేష్‌తోపాటు మరో ఇద్దరిని అరెస్ట్ చేసి, 5 కల్తీ కల్లు కేంద్రాలను ఎక్సైజ్ శాఖ సీజ్ చేసింది. దాదాపు 674 లీటర్ల కల్తీ కల్లును ధ్వంసం చేసింది. ఆదివారం, సోమవారం కల్లు తాగిన కొద్దిసేపటికే బాధితులు వాంతులు చేసుకోవడం ప్రారంభించారు. బాధితుల్లో ఎక్కువ మంది తరచూ కల్లు తాగుతుండడంతో వికారం వల్ల ఇలా జరిగి ఉంటుందని భావించారు. కానీ పరిస్థితి విషమించడంతో మరుసటి రోజు ఉదయం ఆసుపత్రుల్లో ఒక్కొక్కరుగా చేరడం ప్రారంభించారు. హైదర్‌నగర్ రాందేవ్‌రావు ఆసుపత్రిలో ఒకేసారి 15 మంది బాధితులు చేరారు. పరిస్థితి తీవ్రత గమనించిన అధికారులు మెరుగైన వైద్యం కోసం నిమ్స్‌కు తరలించారు. మృతుల్లో ఇద్దరికి శవపరీక్షలు నిర్వహించిన గాంధీ ఆసుపత్రి వర్గాలు కల్లులో ఆల్ప్రజోలం కలిపినట్లు తెలిపారు. %ఖీూ% నివేదికల వచ్చిన తర్వాతగానీ అసలు కారణం తెలుస్తుందని అన్నారు. నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల సంఖ్య 31కి చేరింది. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. రోగుల్లో కొందరు వెంటిలేటర్‌పై ఉండగా, ఆరుగురికి డయాలసిస్ చేస్తున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపారు. మరికొందరు ఫ్లూయిడ్ రిససిటేషన్ చేయించుకుంటున్నారు. మరోవైపు రసాయన కల్తీ కల్లును నిర్ధారించడానికి తెలంగాణ యాంటీ-నార్కోటిక్స్ బ్యూరో (%ుూచీదీ%) బాధితుల నుంచి మూత్ర నమూనాలను కూడా సేకరించింది. బుధవారం ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ రోగులను పరామర్శించారు. ఈ వ్యవహారంలో లింకులు ఉన్న సలు మద్యం డిపోలను అధికారులు సీజ్ చేసి, నమూనాలను ఎక్సైజ్ కెమికల్ ల్యాబ్, ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీకి పంపారు. వీరిపై ప్రభుత్వం క్రిమినల్ చర్యలు, లైసెన్స్ రద్దుకు ఉపక్రమించింది.

## మా చరిత్రను తొలగిస్తే ఇక మేమెవరం?

-మొదటిపేజీ తరువాయి

మేమెవరం? అని నేరుగా ప్రధాని మోదీకే ట్వీట్ చేశారు కేటీఆర్. తెలంగాణ అస్తిత్వాన్ని భౌగోళిక గుర్తింపుని గుర్తించకపోవడం బీజేపీ అధికారిక విధానమా? అని ప్రధాని నరేంద్ర మోదీని ప్రశ్నించారు కేటీఆర్. ఈ మేరకు పలు పశ్నలు సంధించారే కేటీఆర్. 'దశాబ్దాలపాటు తెలంగాణ సాంస్కృతిక గుర్తింపు కోసం, చరిత్రలో తమకు సరైన చోటు దక్కడం కోసం, ప్రత్యేక భౌగోళిక గుర్తింపు, ప్రత్యేక రాష్ట్రం కోసం ఎనలేని పోరాటాలు చేసింది తెలంగాణ గడ్డ. అయితే మీ పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు మా సాంస్కృతిక గుర్తింపుని అస్తిత్వాన్ని ప్రశ్నార్థకం చేసేలా భారతదేశ చిత్రపటాన్ని ఉపయోగించారు. బీజేపీ ఏపీ అధ్యక్షుడు మాధవ్ బహుమతిగా ఇచ్చిన మ్యాపులో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ని మాత్రమే చూపించడం దారుణం. తెలంగాణ రాష్ట్రం అస్తిత్వాన్ని లెక్కచేయకుండా చేసిన చర్య మమ్మల్ని తీవ్రంగా బాధించింది. ఇది పూర్తిగా అనుచితమైంది. భారతదేశ చిత్రపటం నుంచి మా చరిత్రనే తొలగిస్తే మేమెవరం?, ఇది మీ పార్టీ అధికారిక అభిప్రాయమా?, లేదా ఈ చర్య కేవలం ఒక పొరపాటా అనే విషయంపై మీరు వెంటనే స్పష్టత ఇవ్వాలి. ఇది తెలంగాణ ప్రజల త్యాగాలు, రాష్ట్ర సాధన కోసం చేసిన పోరాటాలను, బలిదానాలను అగౌరవపరచడమే కాకుండా మా చరిత్రను నిర్లక్ష్యం చేసిన బిజెపి నేతలు క్షమాపణ చెప్పాలి. పొరపాటైతే, తెలంగాణ ప్రజలని అపహాస్యం చేసినందుకు మీ పార్టీ నాయకత్వం వెంటనే క్షమాపణ చెప్పాలి' అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## కొత్త రేషన్ కార్డుల పంపిణీకి రంగం సిద్ధం

-మొదటిపేజీ తరువాయి

కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు పెట్టుకుంటున్నారు. ఈ సందర్భంగా కామారెడ్డి డీఎస్‌వో మల్లికార్జున్‌బాబు మాట్లాడుతూ కొత్తగా దరఖాస్తులు పెట్టిన వారికి రేషన్‌కార్డుల పంపిణీపై ఇంకా స్పష్టత రాలేదని తెలిపారు. దృశ్య మాధ్యమ సమీక్షలో మాత్రం ఈ జులై 14వ తేదీ నుంచి కార్డులను పంపిణీ చేయాలని సూచించారని, ఇప్పటి వరకు అధికారికంగా ఎలాంటి సమాచారం అందలేదని పేర్కొన్నారు. ఈ నెల 14 నుంచి పంపిణీకి అవకాశం : ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా జారీ అయిన రేషన్ కార్డులను స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ కంటే ముందుగానే లబ్ధిదారులకు పంపిణీ చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల సివిల్ సప్లైస్? డిపార్ట్?మెంట్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్?లో ఈ నెల 14వ తేదీ నుంచి కొత్త రేషన్‌కార్డుల పంపిణీకి తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అధికారిక సమాచారం ఇంకా రాకపోవడంతో నియోజకవర్గాల వారీగా కార్డులను విభజించి పంపిణీకి చేసేందుకు సిద్ధంగా ఉంచారు. కొత్త రేషన్? కార్డులను ఎమ్మెల్యేల చేతుల మీదుగా పంపిణీ చేయించనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం జరుగుతున్న మంత్రిమండలి సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలపై తుదినిర్ణయం వెలువడుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. తేదీలు ఖరారైన వెంటనే నియోజకవర్గాల వారీగా రేషన్ కార్డుల పంపిణీ కొనసాగుతుంది. స్థానిక ఎన్నికల నిర్వహిస్తారని గ్రామంలో వివిధ పార్టీల నేతలు పోటీ చేయడానికి ఇప్పటినుంచే సిద్ధమవుతున్నారు.

# అక్రమ నిర్మాణాలపై చట్టపరంగా చర్యలు







**పనులపై ఎప్పటికప్పుడు తనిఖీలు...**

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు..**

**రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే.రవికుమార్**

**రాజేంద్రనగర్,జులై10(సూర్యరేఖ)**నిబంధనలకు విరుద్ధంగా చేపట్టే అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.రవికుమార్ తెలిపారు.రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో అక్రమంగా చేపట్టే నిర్మాణాలను సహించేది లేదని హెచ్చరించారు.రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అత్తాపూర్ లో అక్రమంగా గ్రౌండ్ ఫ్లోర్ లో నిర్మాణం చేపడుతున్న నిర్వాహకులకు కోర్టు ఆర్డర్ ప్రకారం షోకాజ్ నోటీసులు ఇవ్వడం జరిగింద న్నారు.అయినా నిర్మాణాలు ఆపకపోవడంతో గురు వారం సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. అందులో భాగంగా ఇంటిని టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీధర్,సెక్షన్ అధికారులు సీజ్ చేశారు.అక్రమ నిర్మాణాలపై చట్టప్రకారం తీసుకోవాల్సిన చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామన్నారు. అలాంటి నిర్మాణాలను కూల్చివేయడం,సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు.అక్రమం గా నిర్మాణాలు చేపడితే ఉపేక్షించే ప్రసక్తే లేదని ఆయన పేర్కొన్నారు.పరిమితి మించి అంతస్తుల్లో భవనాలు నిర్మిస్తే కూల్చివేస్తామని తెలిపారు.

# జ్ఞాన సంపన్నులతో గురు పౌర్ణమి జయంతి వేడుకలు

**యోగా గురువు ముల్కల్ల శంకర్,నృత్య గురువు ఉప్పులేటి నరేష్ లకు సత్కారం**



**మందమర్రి,జులై10(సూర్య రేఖ)** గురువు పట్ల ఆదరణ,అంకితభావం,గౌరవాన్ని తెలుపుతూ మందమర్రి పట్టణ బిజెపి కార్యాలయంలో గురువారం గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.భాజపా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటే శ్వర్లు గౌడ్,జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్‌లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా యోగారం గంలో అత్యంత జ్ఞానసంపన్నులైన యోగా గురువు ముల్కల్ల శంకర్,అలాగే కళా రంగంలో విశిష్ట సేవ లు అందిస్తున్న జానపద నృత్య కళాకారుడు ఉప్పు లేటి నరేష్ లను అతిథుల చేత శాలువాతో సత్క రించి,పూల మాల వేసిఘనంగా సన్మానం చేసారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్లు గౌడ్ మాట్లాడుతూ..గురుపౌర్ణమి సందర్భంగా యోగా సాంస్కృతిక రంగాల్లో తమ సేవలందిస్తున్న గురువులను సన్మానించు కోవడం తమ అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పానుగంటి మధు,జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టి కృష్ణ,సీనియర్ నాయకులు దీవి దీక్షితులు,పట్టణ ప్రధాన కార్య దర్శిరంగు శ్రీనివాస్,ఉపాధ్యక్షుడు పోతునూరి రాజేందర్ ఉపాధ్యక్షుడు శనివారపు శ్రీనివాస్ దుర్గం సత్యంబాబు,సీనియర్ నాయకులు కొంతం రాజు గాదె రాములు,మారంరంజిత్,ఓం ప్రకాష్ వెంకటరమణచారి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# సద్గురువులే శరణ్యం

**త్రిశక్తి అష్టలక్ష్మి కామాఖ్య దేవాలయంలో గురుపౌర్ణమి వేడుకలు**

**మందమర్రి,జూలై10(సూర్య రేఖ)** జ్ఞానజ్యోతిని వెలిగించి ప్రగతిపథంలో నడిపించేవాడు గురువని ఆరాధిస్తూ త్రిశక్తి అష్టలక్ష్మి కామాఖ్య దేవాలయంలో గురుపౌర్ణమి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని మందమరిలోని శ్రీశ్రీ త్రిశక్తి అష్టలక్ష్మి కామాఖ్య దేవాలయంలో గురువారం భక్తి భావంతో పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణమంతా శాంతి,శక్తి,భక్తి పరవశతలో మునిగిపోయింది. ఉదయం 10.30 గంటలకు శ్రీ గురు మంత్ర పారాయణంతో వేడుకలు ప్రారంభమయ్యాయి.అనంతరం శ్రీ వలభ మహా గణపతి పూజ,లలిత సహస్రనామ పారాయణం వారాహి-రాజశ్యామల హవనాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు.అర్చకులు వైదిక మంత్రోచ్చారణల నడుమ ఈ కార్యక్రమాలు జరిపారు.ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల పదిహేను నిమిషాల వరకు శ్రీ గురు పాదుకా అభిషేకం ఘనంగా చేశారు.అనంతరం మధ్యాహ్నం 1.30 గంటల వరకు పుష్పార్చన,తీర్థ



ప్రసాద వితరణ,అన్నప్రసాదంతో భక్తులకు సమృద్ధిగా సేవలందించారు.సాయంత్రం 5.45



గంటలకు ప్రారంభమైన శ్రీ గురు తత్వ విశిష్టతపై ఉపన్యాసం భక్తులను ఆధ్యాత్మికంగా అలరించింది.గురు మార్గం,జీవన మార్గదర్శకత గురించి వివరించారు.రాత్రి 7 గంటలకు లలిత సహస్రనామ పారాయణం,వేదగోష,చతుర్వేద పారాయణాలు,విశిష్ట ఆశీర్వచనాలు స్వస్తివ చనాలతో కార్యక్రమాలు ముగిశాయి. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదం పంపిణీ చేశారు.పర్వదినం సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి గురుపాదసేవలో పాల్గొని ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు.ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎన్నికల ఇంచార్జ్ ను సన్మానించిన బెల్లంపల్లి కాంగ్రెస్ నాయకులు



**బెల్లంపల్లి,జులై10(సూర్య రేఖ)** బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాలతో గాంధీ భవన్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎన్ని కల ఇన్చార్జిగా రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ నియామకులైన సందర్భంగా పట్టణ అధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు మేకల శ్రీనివాస్ బండి రాము,లెంకల శ్రీనివాస్,తాళ్ళ కృష్ణ మోహన్,మ్యాదరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవాచ సేవా సంస్థ ఆధ్వర్యంలో యోగ గురువు రమేశ్ కు ఘన సత్కారం



**మందమర్రి,జులై10(సూర్య రేఖ)** పవిత్రమైన గురు పౌర్ణిమను పురస్క రించుకుని పట్టణ ప్రజలకు యోగా ఆరోగ్య గురువుగా పేరుగాంచిన ప్రముఖ యోగా గురువు కొంపల్లి రమేష్ ను శ్రీవాచ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.సమాజానికి రమేష్ చేస్తున్న గణనీయమైన సేవలు,కృషిని గౌరవిస్తూ శ్రీవాచ సేవా సంస్థ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించి గురువు పట్ల తమ అభిమానాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా శ్రీవాచ సేవా సంస్థ సభ్యులు మాట్లాడుతూ..అజ్ఞానమనే చీకట్లను పారద్రోలి జ్ఞానమనే వెలుగు వైపుకి నడిపించే వాడే నిజమైన గురువు అని,ఆది గురువైన వ్యాసుని లక్షణాలు అందిపుచ్చుకున్న కొంపల్లి రమేష్ తను నేర్చుకున్న జ్ఞానాన్ని వ్యాప్తి చేయాలనే లక్ష్యంతో,తన అమూల్యమైన సమయాన్ని వెచ్చించి యోగా ఆసన బోధనల ద్వారా పట్టణ ప్రజలకు యోగా ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రజల అందరికీ ఆచరణాత్మకంగా మార్గనిర్దేశం చేస్తూ ఆరోగ్య పరంగా కొందరి జీవితాలనే మారుస్తున్న వ్యక్తి ఆదియోగి రమేష్ అని ఆయన సేవలు కొనియాడారు.ఈ కార్యక్రమంలో శ్రీవచ సేవా సంస్థ అధ్యక్షులు ఉప్పలంచి చంద్రకాంత్,రాచర్ల గణేష్,నోముల చంద్రశేఖర్,రాయబారపు కిరణ్,తౌసిఫ్,బొజ్జ గణేష్,గడ్డం అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీశ్రీ గురు విశ్వస్ఫూర్తి వారి దివ్య ఆశీస్సులతో ధ్యానమనోప్రస్థాన నందు శ్రీ విశ్వ గురు పౌర్ణమి వేడుకలు..



**హైదరాబాద్, జూలై10(సూర్య రేఖ)..** శ్రీశ్రీశ్రీ గురు విశ్వ స్ఫూర్తి వారి దివ్య ఆశీస్సులతో ధ్యాన మనోప్రస్థాన నందు శ్రీ విశ్వ గురు పౌర్ణమి వేడుకలలో భాగం గా గురువు సూచించిన ప్రస్థాన ధ్యానం ఆసన,ప్రాణాయామ ధ్యా నము నిర్వహించారు.ముఖ్య అతి థులుగా డాక్టర్ గౌరీశంకర్, డాక్టర్ వీణా మురళికృష్ణలు మాట్లాడుతూ. గురువు వివరించి న భౌతిక ఆధ్యాత్మిక జీవితం ప్రత్యేకత వివరించారు.ఈ కార్యక్రమంలో భాగంగా పేద విద్యార్థులకు సైకిళ్లు,పేదలకు వస్త్ర బహూకరణ,అనంతరం దాదాపు 600 మంది భక్తులు కార్యక్రమానికి హాజరై,వారందరూ కూడా గురువు దివ్య ఆశీస్సులు తీసుకొని మహా ప్రసాదం స్వీకరించారు.జన్మదాత-తల్లి,అన్నదాత-రైతు,ప్రాణదాత- వైద్యుడు,జ్ఞాన దాత-గురువు విద్యా మత వేదాంత వివిధ రంగాలకు చెందిన జ్ఞాన భోదకులను,వారి సేవలకు కృతజ్ఞతను సన్మాన గౌరవ పురస్కారాలు ద్వారా వారికి తెలియజేయడానికి ఉద్దేశింపబడినది. గురుపౌర్ణమి,వ్యాస పౌర్ణమి తాను నేర్చిన దానిని ఇతరులకు నేర్పడం జ్ఞానబోధ తనకు తెలిసిన దానిని తెలియజేయడం ప్రచారం వృత్తి జీవనోపాధిగా తన జ్ఞానాన్ని సద్వినియోగం చేయగలగడం,ఆ వ్యక్తి సంస్కారమని వ్యాఖ్యానించారు. ప్రకృతి ఉపయోగాన్ని వినియోగ రీతిగా మార్పు చేయడం,జీవన జీవిత విధానం.అలాగే గురువు నుండి తాము పొందిన జ్ఞానాన్ని సద్వినియోగ బాధ్యత,శిష్యులపై ఉంటుందన్నారు.మనిషి మనసు,జీవితానికి,కర్త-క్రియ కనుక,కర్తగా మనిషి,మనసుకు నేర్పించిన అలవాటుగా నేర్పిన విషయ జ్ఞాన స్వరూప స్వభావాలే,దరిమిలా జీవిత, మంచి-చెడు,క్రియా నిర్వహణ తో జీవన జీవిత స్వరూప స్వభావాలు. అయితే సాధారణ నిత్యజీవితానికి, మానవ ప్రత్యేకతను కలిగించడానికి, ఆధ్యాత్మిక ఉన్నతికి, తత్సంబంధ మేధోశక్తి మరో మనసు అవసరం అవుతాయి. అందుకు ధ్యానమనో ప్రస్థానసాధన ఉద్దేశింపబడింది. యోగ ఆసన ప్రాణాయామ మెడిటేషన్ ప్రాథమికం.తద్వారాలభించే మైండ్ సాధన యోగ్యతను కలిగి ఉంటుంది.

# ఈ కీచక ప్రిన్సిపాల్ మాకొద్దు

**మహిళా ప్రిన్సిపాల్ ను నియమిస్తేనే మేము పాఠశాలకు వస్తాం..మంచిర్యాల జిల్లాలోని ఓ ఐ.టి.ఐ కళాశాలలో జరిగిన ఘటన మరువకముందే..కోటపల్లిలో ప్రిన్సిపాల్ చరిత్ర బయటపడింది సంబంధిత ఉన్నతాధికారుల చర్యలు లేకనే విద్య సంస్థ కుంటుపడుతుందని విద్యార్థి సంఘాల ఆరోపణలు.**






**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా,జులై10(సూర్యరేఖ)** మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గం కోటపల్లి మండలంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు అశోక్ చేష్టలపై విద్యార్థినులు ఆగ్రహానికి గురైన కళాశాల ముందు బుధవారం ధర్నాకు దిగారు.పాఠశాలలో చదువుతున్న విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ ప్రైవేట్ పార్ట్స్ లను తాకుతూ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని,ఇలాంటి ప్రధానోపాధ్యాయుడు మాకు వద్దని విద్యార్థినిలు విద్యార్థి సంఘాలు ఆరోపిస్తూ పాఠశాల ముందు ధర్నాకు దిగారు.ఆదివాసి సంఘ నాయకులు ఘటన స్థలానికి చేరుకొని విచారించి ప్రధానోపాధ్యాయుడిని విధుల నుంచి తొలగించి ఈ పాఠశాలకు లేడీ ప్రిన్సిపాల్ ను పంపించాలని డిమాండ్ చేశారు. వెంటనే ఐటీడీఏ పీ.వో కుష్బూ గుప్తా ఈ ఘటనపై చర్యలు తీసుకోవాలని కోరారు.

**ఓ ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ ఘటన మరువకముందే మరో ఘటన ఆశ్చర్యం:**

మంచిర్యాల జిల్లాలో ఓ ఐటిఐ కళాశాలలో జరిగిన నీలి చిత్ర ప్రదర్శన గురించి ఒక పత్రికలో వచ్చిన సంఘటన మరువకముందే విద్యాసంస్థలో ఇలాంటి సంఘటనలు ఉత్పన్నమవడం బాధాకరంగా ఉందని విద్యార్థి సంఘ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.విద్యా బుద్ధులునేర్పించేటటు వంటి విద్యాసంస్థలోనే ఇలాంటి సంఘటనలు ఉత్పన్నమవుతుంటే మిగతా సంస్థల గురించి ఇంకేమి ఉంటుందని వారు ఆరోపించారు.ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు ఉన్నతాధికారుల స్పందన లేకపోవడం వల్లనే ఇలాంటి ఘటనలు ఉత్పన్నమవుతున్నాయని వారు ఆరోపించారు. కోటపల్లి ఎస్సై రాజేందర్ ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని విద్యార్థి సంఘాలకు నచ్చజెప్ప ప్రయత్నించారు. ఉన్నతాధికారులు వచ్చి విచారణ చేపట్టేవరకు పాఠశాలకు వెళ్ళమని విద్యార్థినులు తెగేసి చెప్పడం విశేషం.

## గురు పౌర్ణమి సందర్భంగా సీనియర్,న్యాయవాదులకు, సన్మానించిన, న్యాయవాది నల్లుల సంగీత





**ముఖ్యఅతిథిగా పాల్గొన్న బెల్లంపల్లి,సివిల్ జడ్జి ఏపిపిఓ**

**బెల్లంపల్లి,జూలై10 (సూర్యరేఖ)** గురు పూర్ణిమ సందర్భంగా బెల్లంపల్లి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో సీనియర్,జూనియర్ న్యాయవాదులు నల్లుల సంగీత ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించడం జరిగింది. ఇందుకు జూనియర్ సివిల్ జడ్జిని ఏపీపిఓని ముఖ్య అతిథులుగా ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.ఇందులో సీనియర్ న్యాయవాదులు ఎల్‌రాము,ఎం. శ్రీనివాస్, కే.బాలు,అంకెం శివకుమార్,చెప్ప మనోహర్ చేను రవికుమార్ జూనియర్ న్యాయవాదులు పాల్గొని సీనియర్ న్యాయవాదులకు శాలువాతో సన్మానం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

# సాయిబాబా దేవాలయంలో ఘనంగా గురు పౌర్ణమి ప్రత్యేక పూజలు





### హాజరైన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**ఉప్పల్,జూలై10(సూర్యరేఖ)** ఉప్పల్ డివిజన్ పరిధిలోని సరస్వతినగర్ లోని సాయి బాబాదేవాలయంలో గురు పూర్ణిమ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.ప్రత్యేక పూజ కార్యక్రమాలు,అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి,బీఆర్ ఎస్ పార్టీ మల్కాజ్ గిరి పార్లమెంట్ ఇంఛార్జి రాగిడి లక్ష్మారెడ్డి హాజరయ్యారు.ప్రత్యేక పూజలు అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...సాయిబాబా ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

### గురు పౌర్ణమి ప్రత్యేక పూజలు పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి,కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్



**బట్టలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే,కార్పొరేటర్**

**ఉప్పల్,జూలై10 (సూర్యరేఖ)** గురు పౌర్ణమి సందర్భంగా నాచారం డివిజన్ బీఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గౌడెల్లి రామకృష్ణ నివాసంలో ఏర్పాటుచేసిన గురు పౌర్ణమి ప్రత్యేక పూజలో ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్,లు పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన బట్టల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని వారు బట్టలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్,లను గౌడెల్లి రామకృష్ణ ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమానికి డివిజన్ నాయకులు,పుర ప్రముఖులు,పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### వర్షాకాలం నేపథ్యంలో ప్రజలను మున్సిపల్ అధికారులు రోగాల బారి నుండి కాపాడాలి..

**ఎంసిపిఐయు పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పశులేటి వెంకటేష్**



**బెల్లంపల్లి,జూలై10(సూర్యరేఖ)** వర్షాలు పడుతున్న క్రమంలో బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని 34 వార్డులలో బ్లీచింగ్ పౌడర్,క్లోరినేషన్,దోమల ఫాగింగ్ చేయాలని ఎంసిపిఐయు పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పశులేటి వెంకటేష్ మున్సిపల్ అధికారులను కోరారు.ఈ మేరకు ఎంసీపీఐయు పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ మాట్లాడుతూ...బెల్లంపల్లి పట్టణంలో తినుబండారాల బండ్లు ఎక్కడపడితే అక్కడ వెలిశాయని,బండ్ల మీద ఎలాంటి దోమతెరలు లేకుండా ఇష్టం వచ్చినట్లు అమ్ముతున్నారని మండిపడ్డారు.తినుబండారాలను అమ్మే బండ్లను పరిశీలించి తినుబండారాలను అమ్మే వారిపై మున్సిపల్ అధికారులు చర్య తీసుకోవాలని సూచించారు.బెల్లంపల్లి మున్సిపాలిటీలో ఫుడ్ ఇన్స్పెక్టర్ లేకపోవడం అనేది చాలా వింతగా ఉందని, ఫుడ్ ఇన్స్పెక్టర్ లేక ఇష్టానుసారంగా కల్తీ నూనెలతో తినుబండారాలను తయారు చేస్తున్నారని అన్నారు. దీనివలన ప్రజలు రోగాల బారిన పడే అవకాశాలు ఉన్నాయని అధికారులకు సూచించారు.బెల్లంపల్లి ప్రజలను దృష్టిలో పెట్టుకొని 34 వార్డులలో బ్లీచింగ్ క్లోరినేషన్,దోమల ఫాగింగ్ చేయాలని అదేవిధంగా, బండ్లపై కల్తీ పదార్థాలతో తినుబండారాలు తయారు చేస్తున్న వారిపైన చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్ డిడబ్ల్యు జిల్లా మహిళా కార్యదర్శి దుర్గం లక్ష్మీ,తదితరులు పాల్గొన్నారు.

### బిఎల్వోల శిక్షణ తరగతులను పరిశీలించిన అదనపు కలెక్టర్ నగేష్,ఆర్డీవో రమాదేవి



**నిజాంపేట,జులై10(సూర్యరేఖ)** మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం మండలంలోని 29 మంది బీఎల్ఓలకు స్థానిక తాహసిల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఓటర్ జాబితా శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్,ఆర్డీవో రమాదేవి,హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈనెల 3వ తారీకు నుండి 17వ తారీకు వరకు బిఎల్ఓలకు శిక్షణా తరగతులు ఏర్పాటు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.ఎన్నికల విధి నిర్వహణలో చట్టపరమైన అంశాలపై బిఎల్వోలకు శిక్షణ తరగతులలో వివరించామన్నారు.ప్రజాస్వామ్య దేశంలో ప్రతి ఒక్కరూ తమఓటు హక్కును వినియోగించుకోవాలన,18 సంవత్సరాల నిండి ఉన్న ఆడ మగ సంబంధించి ఓటు హక్కు నమోదు చేసుకునే బాధ్యత బిఎల్వోలదే అన్నారు.ఫామ్ నెంబర్ 8 ద్వారా మార్పులు చేర్పులు చేసుకోవచ్చని, రానున్న రోజుల్లో బిఎల్ఓలు ఇంటింటి సర్వే చేపట్టేలా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాహసిల్దార్ రమ్యశ్రీ,ఆర్ఐ లు ప్రీతి,ఇమాద్,సీనియర్ అసిస్టెంట్ రమేష్,కంప్యూటర్ ఆపరేటర్లురాజు కరుణాకర్,రెవెన్యూ సిబ్బంది బిఎల్వోలు పాల్గొన్నారు.

### మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందించిన ఎమ్మెల్యే..



**నిజాంపేట,జులై10(సూర్యరేఖ)** మండల కేంద్రానికి చెందిన కొమ్మట శ్రీధర్(28)గత ఐదు రోజుల క్రితం మద్యం మత్తులో పురుగుల మందు సేవించి హాస్పిటల్ లో చికిత్స పొందుతూ బుధవారం మరణించడం జరిగింది.ఇట్టి విషయాన్ని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు దృష్టికి తీసుకెళ్లగా తక్షణ సహాయం కింద మండల అధ్యక్షులు వెల్దుర్తి వెంకటేష్ గౌడ్,చేతుల మీదుగా మృతుని భార్యకు రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు.నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తున్న మైనంపల్లి రోహిత్ రావు,హనుమంతరావు,లకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు కొమ్మట బాబు,సుధాకర్,బాల్ రాజ్, తదితరులు పాల్గొన్నారు.

# మీర్ పేట్ హెచ్ బికాలనీలో గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలో పరమేశ్వర్ రెడ్డి





**ఉప్పల్,జులై10(సూర్యరేఖ)** గురుపౌర్ణమి సందర్భంగా గురువారం ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి మీర్ పేట్ హెచ్ బికాలనీ డివిజన్ వెంకటేశ్వరనగర్ కాలనీ సాయిబాబా దేవస్థానంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.దేవాలయ కమిటీ ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. పూజానంతరం పరమేశ్వర్ రెడ్డి సద్గురువుల ఆశీస్సులు తీసుకొని,అందరికీ గురుపౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు అంజయ్య శ్రీనివాస్,ఉదయ్ కిరణ్ సురేషగౌడ్ సురేష్ జెమినీ,కృష్ణ,శ్రీను,ఆకాష్, సునీత సుబ్బు శ్రావణగౌడ్,భూపాల్ రెడ్డి,వేణు, కిషోర్,జానీ,ఇతర ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# మల్లాపూర్ లో కొత్త విద్యుత్ స్థంబాలు ఏర్పాటు చేయాలి





నెమలి అనిల్ కుమార్

**ఉప్పల్,జూలై10 (సూర్యరేఖ)** మల్లాపూర్ డివిజన్ లోని చాల ప్రాంతాల్లో అకాల వర్షాల కారణంగా పాతబడ్డ స్థంబాలతో ప్రజలు చాల ఇబ్బంది పడుతున్నారని,ప్రస్తుతం జరుగుతున్న బస్తీ బాట కార్యక్రమాల్లో ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చారని గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ తెలిపారు, మల్లాపూర్ విద్యుత్ శాఖ ఏఈ.నాగ రాజ్ తో సమావేశమై అన్నపూర్ణ కాలనీ,పఠాన్ బస్తీల్లో కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని ఏ.ఈ.కి వినతి పత్రాన్ని అందజేశారు. పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి అవసరమైన చోట్ల నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తామని ఏ.ఈ.వారికి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ సంయుక్త కార్యదర్శి వి.శ్రీనివాస్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు కె.సురేష్ గౌడ్ పాల్గొన్నారు.

# నాచారం మహంకాళి దేవాలయం నూతన కమిటీని సన్మానించిన పరమేశ్వర్ రెడ్డి





**ఉప్పల్,జూలై10(సూర్యరేఖ)** నాచారం మహంకాళి దేవాలయం అభివృద్ధికి నూతనంగా ఎన్నికైన ఛైర్మెన్ ధర్మకర్తలు బాధ్యతతో కృషి చేయాలని ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి కోరారు.గురువారం ఉప్పల్ నియోజకవర్గ నాచారం మహంకాళి సహిత మహాకాళేశ్వర స్వామి దేవాలయం ఎండోమెంట్, ప్రభుత్వ సహకారంతో నూతన చైర్మన్,లను గురువారం ఘనంగా సన్మానించడం జరిగింది.ఈ సందర్భంగా మందముల పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ...నూతనంగా దేవాలయ చైర్మన్ గా ఎన్నికైన వారు దేవాలయం అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. దేవాలయం అభివృద్ధికి పాటు పడాల్సిన అవసరం పాలక కమిటీకి ఉన్నదని పేర్కొన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని పేర్కొన్నారు.ఆలయాల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం ద్వారా నిధుల మంజూరుకు తాను తోడ్పాటు అందిస్తున్నానని తెలిపారు.నాచారం ప్రజలు ఆకాంక్షించిన రీతిలో అభివృద్ధి చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.రానున్న మహంకాళి బోనాల ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించాలని, ప్రజల భక్తుల అభీష్టం మేరకు నిర్వహించి మంచి పేరు తెచ్చుకోవాలని కమిటీకి సూచించారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ ఎంతో గొప్ప పార్టీ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అద్భుతమైన పాలన రాష్ట్రంలో జరుగుతుందని పరమేశ్వర్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు.ఆలయ చైర్మన్ గా మెతుకు శ్రీనివాస్ రెడ్డి,ధర్మకర్తలు నెమలికొండ సునీల్ రెడ్డి,టిహెచ్ బాలరాజు,ఈ.కృష్ణ యాదవ్,టీ.ఉమ,తేనీరు రాకేష్ నర్సింగరావు, శ్రీమంతు గౌడ్ ఈ.వో. వెంకన్న,నాచారం డివిజన్ అధ్యక్షుడు బండారి శ్రీకాంత్ గౌడ్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ప్రకాష్ రెడ్డి,కోఆర్డినేటర్ చెన్ రెడ్డి రఘుపతి రెడ్డి,మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి,నూతల కంటి రాజు మహేష్ యాదవ్,క్రాంతి కుమార్,లీల, భారతమ్మ,ఇతర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫామ్, టై,బెల్ట్ పంపిణీ..



**నిజాంపేట,జులై10(సూర్యరేఖ)** మండల పరిధిలోని కాసింపూర్ తాండ గ్రామంలో గురువారం ప్రైమరీ స్కూల్ విద్యార్థిని విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫామ్స్ టై బెల్ట్,లను నిజాంపేట మండల కాంగ్రెస్ యువజన అధ్యక్షులు రాంచందర్ నాయక్ అందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంపత్ కుమార్,అంగన్వాడీ టీచర్ నాగలక్ష్మి గ్రామస్తులు మోహన్ నాయక్,చింటు నాయక్,గణేష్ నాయక్ ప్రకాష్ నాయక్,తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రగతి ధర్మారంలో కరెంటు అంతరాయం..



**నిజాంపేట,జులై10(సూర్యరేఖ)** రామాయంపేట మండల పరిధిలోని ప్రగతి ధర్మారం సబ్స్టేషన్ పరిధిలో గల గ్రామాలకు నేడు ఉదయం11 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ ఏఈ గణేష్ ఓ ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రగతి ధర్మారం 33/11కెవి సబ్స్టేషన్ లో మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని దీనికి గ్రామ ప్రజలు సహకరించాలని కోరారు.

## గురువులను సత్కరించిన న్యూహేమానగర్ కాలనీ అధ్యక్షులు రాజేష్,కాలనీవాసులు



**హైదరాబాద్,జూలై 10 (సూర్యరేఖ)** గురుపౌర్ణమి సందర్భంగా యోగ గురువులు చంద్రమౌళి,మాక్డోల్ కాలనీ అధ్యక్షులు ప్రసాద్ రెడ్డి, లను న్యూహేమానగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు కటకం రాజేష్ ఆధ్వర్యంలో కాలనీవాసులు ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా కటకం రాజేష్ మాట్లాడుతూ...గురువు లేనిదే ఏది లేదని వారి శిక్షణలోనే ప్రతి ఒక్కరూ సమాజానికి దోహదపడేలా తయారవుతున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కరాటే గురువు ప్రసాద్,మోహన్ రావు కోడం రమేశ్,బండి రోశయ్య, ఉర్మిళ,ఈదుల రేణుకా,మునిదేవీ శేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ నియోజకవర్గం ప్రజలకు గురుపౌర్ణిమ శుభాకాంక్షలు..

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ఉప్పల్,జూలై10 (సూర్యరేఖ)** చిల్కానగర్,ఉప్పల్ డివిజన్ల పరిధిలోని ధర్మపురి కాలనీ,సరస్వతినగర్ కాలనీలోని సాయిబాబా దేవాలయంలో గురుపౌర్ణమి సందడి నెలకొంది. గురువారం తెల్లవారుజాము నుంచే సాయిబాబాను దర్శించుకునేందుకు భక్తులు క్యూకట్టారు.దీంతో ఆలయాలన్నీ భక్తులతో రద్దీగా మారిపోయాయి.గురు పూర్ణిమ సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజ,అన్నదాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి,బీఆర్ఎస్ పార్టీ మల్కాజ్ గిరి పార్లమెంట్ ఇంఛార్జి రాగిడి లక్ష్మారెడ్డి,బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్,లు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

సూర్య



# హెచ్ సిఏ అధ్యక్షుడు జగన్ మోహన్ రావుతో పాటు ప్యానెల్ ను బర్తరఫ్ చేసి పూర్తిగా ప్రక్షాళన చేయాలి






**హెచ్ సిఏ. అవినీతి,అక్రమాలపై విచారణ జరిపి బాద్యులను కఠినంగా శిక్షించాలి..**

**డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేష్**

**ఉప్పల్,జూలై10 (సూర్యరేఖ)** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ లో అవినీతి, అక్రమాలకు పాల్పడిన హెచ్ సిఏ అధ్యక్షుడు జగన్మోహన్ రావు,సీఈఓ సెక్రటరీ ప్యానెల్ సభ్యులను బర్తరఫ్ చేయాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం ఉప్పల్ లోని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ కార్యాలయం ముందు అవినీతి అక్రమాలకు పాల్పడిన హెచ్సీఏ అధ్యక్షుడు జగన్మోహన్రావుతో పాటు ప్యానల్ సభ్యులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని హెచ్సిఏ ను పూర్తిగా ప్రక్షాళన చేయాలని ధర్నా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అవినీతి అక్రమాలకు నిలయంగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ మారిందా న్నారు. ఐపీఎల్ టికెట్ల నుండి స్టేడియంలో జరిగిన అనేక అవినీతి అక్రమాల వరకు హెచ్సీఏ అధ్యక్షుడు జగన్మోహన్రావు ప్రమేయం ఉందన్నారు. నకిలీ పత్రాలను సృష్టించి క్లబ్బులను ఏర్పాటు చేసి అధ్యక్షుడు అయ్యారన్న ఆరోపణలు అధ్యక్షుడు జగన్మోహన్ రావుపై ఉన్నాయి.ఐపీఎల్ మ్యాచ్లు జరుగుతున్న సందర్భంలో అధ్యక్షుడిగా తన ఆధిపత్యాన్ని చెలాయించుకొని టికెట్ల గోల్మాల్ విషయంలో అదేవిధంగా స్టేడియంలో జరిగిన పనుల ఏర్పాట్ల విషయంలో అనేక అవినీతి ఆక్రమాలకు పాల్పడ్డారు.మొదటినుంచి హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ వివాదాలకు కారణమవు తుందన్నారు.తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం హెచ్సిఏ కార్యకలాపాలపై పర్యవేక్షణ పెట్టాల్సిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అవినీతి అక్రమాలకు పాల్పడిన హెచ్సీఏ అధ్యక్షుడు జగన్మోహన్రావుతో పాటు మొత్తం ప్యానల్ ను బర్తరఫ్ చేసి పూర్తిగా ప్రక్షాళన చేయాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా విచారణ చేపట్టి భాద్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇందులో ప్రమేయం ఉన్నా చక్ర క్రికెట్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కవిత రాజేంద్ర యాదవ్ లపై కూడా కఠినమైన చర్యలు తీసుకొని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా హెచ్సీఏను తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఒక్క హైదరాబాద్ లోనే 30 క్లబ్ లు ఉన్నాయి.వాటిని రద్దు చేసి రాష్ట్రంలో 33 జిల్లాలకు జిల్లా స్థాయిలో క్లబ్ లు ఏర్పాటు చేసి గ్రామీణ స్థాయి క్రీడకారులకి క్రికెట్ కోచింగ్ ఇచ్చి వారిని ప్రోత్సహించాలని కోరారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యక్షంగా క్రీడాభివృద్ధి కోసం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు ఈ ధర్నా కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండి జావీద్,రాష్ట్ర నాయకులు ఆరేల్ మూర్తి కె.విజయ్ రాజు రవి నాగరాజు ప్రశాంత్,శివ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నోట్ బుక్స్ పంచిన పరమేశ్వర్ రెడ్డి





**ఉప్పల్,జూలై10 (సూర్యరేఖ)** గురుపౌర్ణమి సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నాయకులు పడమటి మల్లారెడ్డి ఆధ్వర్యంలో వాసవి మిత్ర మండలి సహకారంతో వంపుగూడలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్కులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి,కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి,లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ...గురు పౌర్ణమి రోజు పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు పంచడం శుభదాయకమని,ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేయాలని కోరుకుంటున్నానని,వాసవి మిత్రమండలి సభ్యులను,పడమటి మల్లారెడ్డి,లను అభినందించారు.ఈ కార్యక్రమంలో వాసవి మిత్ర మండలి సభ్యులు పెద్ది నాగరాజు,రెబెల్లి శ్రీనివాస్, రామిని తిరుమలేష్,గంప కృష్ణ వైవియు నాగేశ్వర్ రావ్,బాచెల్లి నవీన్,చంద్రగిరి తారకేశ్వర్,తండే శివ, సముద్రాల హరినాథ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చర్లపల్లి మాజీ కార్పొరేటర్ ధన్ పాల్ రెడ్డి,కాప్రా డివిజన్ అధ్యక్షులు నాగ శేషు,మాజీ కౌన్సిలర్ రాజేందర్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంజి రెడ్డి,పెద్ది నాగరాజు,మేడ్చల్ మల్కాజ్గిరి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్,డైరెక్టర్ పూర్ణ యాదవ్,యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రశాంత్ గౌడ్, కాంగ్రెస్ మహిళా నాయకురాలు జ్యోతి,లక్ష్మీ, నాయకులు పి.పవన్ కుమార్ జి.సత్యనారాయణ, వినోద్,నరేందర్ గౌడ్ శ్రీధర్ రెడ్డి,తన్నీరు శ్రీహరి నాగరాజు,రాకేష్ యాదవ్,మురళి,ఆరీఫ్, ఇమ్రాన్ షాబుద్దీన్ సంతోష్ చారి,ఆకుల సంతోష్, మనోజ్ అభిరాజన్, రాజు,నాగరాజు యాదవ్, వంపుగూడ గ్రామ పెద్దలు లక్ష్మణ్ యాదవ్,బాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,హరీష్ యాదవ్,ధర్మేందర్ రెడ్డి. పాఠశాల ఉపాధ్యాయులు హెచ్ఎం వసంత, పద్మావతి,ఉమా,తదితరులు పాల్గొన్నారు.

# గురుపౌర్ణమి ఉత్సవాల్లో పాల్గొన్న నెమలి అనిల్ కుమార్





**ఉప్పల్,జూలై 10 (సూర్యరేఖ)** మల్లాపూర్ డివిజన్ గ్రీన్ హిల్స్ కాలనీలోని శ్రీగణేష్ సాయిబాబా దత్తాత్రేయ దేవస్థానంలో గురువారం జరిగిన గురుపౌర్ణమి ఉత్సవాల్లో గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు గురుపౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో నెమలి రవి కుమార్,సీతాల వీరాస్వామి సత్తయ్య గోవర్ధన్ రెడ్డి కాటం గౌడ్,నెమలి శ్రవణ్,నెమలి సందీప్ నర్సింహా ఉపేందర్,నాగరాజ్,శ్రీనివాస్ సూరజ్ సాయి,దేవస్థాన కమిటీ సభ్యులు,ఆలయ సేవకులు తదితరులు పాల్గొన్నారు.

## సమాజంలో గురువులకు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది..

**హబ్సిగూడ కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్**



**ఉప్పల్,జూలై 10 (సూర్యరేఖ)** గురుపౌర్ణమి సందర్భంగా హబ్సిగూడ డివిజన్ లోని జైసంతోష్ నగర్ ప్రాథమిక పాఠశాలలో హబ్సిగూడ డివిజన్ మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు సాదినేని గీత ఆధ్వర్యంలో హబ్సిగూడ డివిజన్ కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్ గురువులను సత్కరించి సన్మానించారు.పిల్లలకు నోట్ పుస్తకాలు పెన్నులు పెన్సిళ్లు అందించడం జరిగింది.ఈ సందర్భంగా కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్ మాట్లాడుతూ... సమాజంలో గురువులకు ప్రత్యేకమైన గుర్తింపు ఉందని పిల్లలందరికీ మంచిగా విద్యాబుద్ధులు నేర్పించి ప్రయోజకులను చేసి మన దేశాన్ని మన ధర్మాన్ని కాపాడే పౌరులుగా తీర్చిదిద్దాలని గురువులను కోరారు.ఈ కార్యక్రమంలో డివిజన్ బిజెపి ప్రధాన కార్యదర్శి చెల్లోజు ఎల్లాచారి,చింతకింది ప్రవీణ్,స్థానికులు ప్రదీప్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి,బరత్ జీ,మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బండి పద్మ,కొండేరు స్రవంతి బానోతు రమేష్ నాయక్,అల్కాపురి సురేష్,లక్ష్మి,తదితరులు పాల్గొన్నారు.

## నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి అభివృద్ధికి కృషి..

**జియాగూడ కురుమ బస్తిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం..**

**డివిజన్ కార్పోరేటర్ బోహిని దర్శన్**



**నాంపల్లి,హైద్రాబాద్,జూలై10(సూర్యరేఖ)**నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి జియాగూడ డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని డివిజన్ కార్పోరేటర్ బోహిని దర్శన్ అన్నారు. గురువారం జియాగూడ డివిజన్ లోని కురుమ బస్తీ రావి చెట్టు,యాప చెట్టు శ్రీనల్ల పోచమ్మ మహంకాళి మాత దేవాలయం ప్రాంగణం ఆవరణలో భారతీయ జనతా పార్టీ జియాగూడ డివిజన్ కార్పోరేటర్ బోహిని దర్శన్ సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా దర్శన్ మాట్లాడుతూ...డివిజన్ పరిధి లోని అన్ని ప్రాంతాలల్లో మురుగు నీరు పారుదల పైప్ లైన్ పనులు,తగు నీటి సరఫరా పైప్ లైన్ పనులు పూర్తి చేసి సీసీ రోడ్డు పనులను చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ,వారిలో ఒకరిగా,వారితో మమేకమై ఎప్పటికి సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో బోనాల కమిటీ అధ్యక్షులు దేవర శివశంకర్,ఉల్పే శ్రీనివాస్,గంగాల హనుమంతరావు,ధన్ని శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ జీకి జన్మదిన శుభాకాంక్షలు..

**డిజ్వార్ సింగ్.**



**నాంపల్లి,హైద్రాబాద్,జూలై 10(సూర్యరేఖ)**భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు,భారత దేశ రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కు భారతీయ జనతా పార్టీ గోల్కొండ జిల్లా ప్రధాన కార్యదర్శి డిజ్వార్ సింగ్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భముగా డిజ్వార్ సింగ్ మాట్లాడుతూ...ఆయన భౌతిక శాస్త్ర అధ్యాపకునిగా తన కెరీర్ ను ప్రారంభించారని,జనతా పార్టీతో కలసి ఉన్నపుడు జాతీయ సంస్థ అయిన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘంతో తన అనుబంధాన్ని కొనసాగించారన్నారు.అంచెలంచెలుగా ఎదిగిన వ్యక్తి రాజ్‌నాథ్ సింగ్ అని కొనియాడారు. దేశ ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలోని ఎన్.డి.ఎ ప్రభుత్వంలో భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖ మంత్రిగా పనిచేస్తున్నారు.ఆయన ముందు చూపుతో దేశానికి చేస్తున్న సేవ వెల కట్టలేనిదన్నారు.

# గురు పూర్ణిమ సందర్భంగా కార్వాన్ ధర్బార్ మైసమ్మ ఆలయం వద్ద గంజి రఘునాథ్ అన్న ప్రసాద వితరణ




**నాంపల్లి,హైద్రాబాద్,జూలై 10(సూర్యరేఖ)** భారతీయ జనతా పార్టీ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ సభ్యులు గంజి రఘునాథ్ ఆధ్వర్యంలో కార్వాన్ ధర్బార్ మైసమ్మ దేవాలయం ప్రాంగణంలో గురు పూర్ణిమ పురస్కరించుకుని గురువారం మధ్యాహ్నం మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ ..అన్నం పరబ్రహ్మ స్వరూపమని దానాలలోకెల్లా అన్నదానం గొప్పది కావున గురు పూర్ణిమ పురస్కరించుకుని అన్నప్రసాద వితరణ నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. భారీ సంఖ్యలో పాల్గొన్న నాయకులు, భక్తులు అమ్మ వారి ప్రసాదం స్వికరించి ధర్బార్ మైసమ్మ ఆశీర్వాదం పొంధరని గంజి రఘునాథ్ తెలిపారు.

# గంజాయి,ఇతర మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం




**మత్తుకు చిత్తవుతే భవిష్యత్తు అంధకారం..**
**బెల్లంపల్లి ఏసిపి ఎన్.రవికుమార్**

**మందమర్రి,జులై10(సూర్యరేఖ)** మత్తు పదార్థాల నిర్మూలనే లక్ష్యంగా పోలీస్ శాఖ పని చేస్తుందని,యువత భవిష్యత్తును నాశనం చేస్తూ నిషేధిత గంజాయిని రవాణా చేసే వ్యక్తులపై నిర్దాక్షిణ్యంగా ఉక్కుపాదంతో అణచివేస్తామని మత్తుకు చిత్తవుతే భవిష్యత్తు అంధకారం అవుతుందని యువత దురలవాట్లకు దూరంగా ఉండాలని బెల్లంపల్లి ఏసిపి రవికుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని విద్యానగర్, చెంచు కాలనీలలోని పాత నేరస్తులు,సస్పెక్ట్ షీటర్లు, రౌడీషీటర్లు,సంఘ విద్రోహక శక్తుల ఇళ్లపై ఆకస్మిక దాడులు చేపట్టి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసిపి రవికుమార్ మాట్లాడుతూ. గతంలో నేరాలు చేసి,పదే పదే శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న పాత నేరస్తుల కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తున్నామని నిరంతరం పోలీసుల నిఘా కొనసాగుతుందని స్పష్టం చేశారు. యువతను తప్పుదోవ పట్టించే గంజాయి అమ్మకం, రవాణా వినియోగం వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలను పూర్తిగా నిర్మూలించడమే పోలీసుల లక్ష్యం అని అన్నారు. ఎవరైనా గంజాయి వంటి మత్తు పదార్థాల వాడకాన్ని ప్రోత్సహించినా, అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



అనంతరం కాలనీలో పర్యటించి ప్రతి షీటర్ ఇంటికి వ్యక్తిగతంగా వెళ్లి వారి జీవన శైలిని, ప్రస్తుత స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. గతాన్ని వదిలిపెట్టి మంచిగా బతికి సమాజంలో గౌరవ ప్రదమైన జీవితం గడపాలని కోరారు. పోలీసుల హెచ్చరికలను పెడచెవిన పెట్టి,నేర ప్రవృత్తిని పునరావృతం చేస్తే,పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.అనంతరం పాత బస్టాండ్ జయశంకర్ చౌరస్తాలో పట్టణ సీఐ శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో 'నాకాబందీ' నిర్వహించారు.సరైన పత్రాలు,నంబర్ ప్లేట్లు లేని వాహనాలను గుర్తించి సీజ్ చేశారు.కార్లకు పరిమితికి మించి అమర్చిన బ్లాక్ ఫిల్మ్‌లను తొలగించి యజమానులకు జరిమానాలు విధించారు.ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్సై రాజశేఖర్, కాసిపేట ఎస్సై ప్రవీణ్, దేవపూర్ ఎస్సై ఆంజనేయులు,అదనపు ఎస్సై శ్రీనివాస్,పోలీస్ సిబ్బంది,ప్రత్యేక బలగాలు పాల్గొన్నారు.

# బాల కార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించాలి






**జిల్లా వ్యాప్తంగా 8 కేసుల నమోదు..**
**అన్ని శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు.**
**జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు**

**మెదక్,జులై 10(సూర్యరేఖ)** రాష్ట్రవ్యాప్తంగా జూలై 1 నుండి ఆపరేషన్ ముస్కాన్ ప్రారంభమైన సందర్భంగా పది రోజుల వ్యవధిలో మెదక్ జిల్లాలో అన్ని శాఖల సమన్వయంతో ఆపరేషన్ ముస్కాన్ దిగ్విజయంగా కొనసాగుతుందని,అన్ని శాఖల సమిష్టి కృషితో బాల కార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలిద్దామని జిల్లా ఎస్పీ డి.వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.గురువారం పోలీసు ముఖ్య కార్యాలయంలో వివిధ శాఖల సమన్వయంతో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఎస్పీ ముఖ్యఅతిథిగా పాల్గొని సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లాలో ముఖ్యంగా హోటల్లు ఇటుక బట్టీల నిర్మాణ పనుల,వ్యాపార సముదాయాల నందు పనిచేస్తున్న బాల కార్మికులను గుర్తించి వారిని తల్లిదండ్రులకు సంరక్షణ గృహాలకు కానీ చేర్చి యజమానులపై తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా పిల్లల బాల్యం బడులకు అంకితం కావాలని కార్మికులుగా కర్షకులుగా కొనసాగరాదని సూచించారు.ఇప్పటివరకు జిల్లాలో 41 మంది బాలలను రక్షించి తల్లిదండ్రులకు, సంరక్షణ స్థలాలకు చేర్చడం జరిగిందని, జిల్లా వ్యాప్తంగా మొత్తం 8 కేసులను నమోదు చేసినట్లు, బాల కార్మికులను పనిలో ఉంచుకుంటున్న వారిపై కఠినచర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమం నెల రోజుల పాటు నిర్వహించనున్నట్లు అన్ని శాఖల సమిష్టి కృషితో కొనసాగాలని,ప్రతిరోజు జిల్లాలోని అన్ని మండల కేంద్రాలను గ్రామాలను సందర్శిస్తూ బాల కార్మికులను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్,డిసిఆర్ బి ఇన్స్పెక్టర్ మధు సుధన్ గౌడ్,సీడీపీఓ కరుణశ్రీ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ ఉప్పలయ్య,హెల్త్ డిపార్ట్మెంట్,ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్,లేబర్ డిపార్ట్మెంట్ యన్జిఒ సభ్యులు రెండు డివిజన్లకు చెందిన ఆపరేషన్ ముస్కాన్ టీం లు పాల్గొన్నారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్,జులై10(సూర్యరేఖ)** తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామివారిని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. గురు పౌర్ణమి సందర్భంగా శనివారం వేకువజామున శ్రీవారి సుప్రభాత సేవలో తన సోదరుల కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో తితిదే అధికారులు ఎమ్మెల్యే డి.ప్రకాష్ గౌడ్ వేదాశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.శ్రీకారిని దర్శించుకోవడం ఎంతో భాగ్యంగా భావిస్తున్నానని అన్నారు.నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఏడుకొండల స్వామిని కోరుకున్నామని వెల్లడించారు.తిరుమల వెంకటేశ్వర స్వామి దర్శించుకున్న వారిలో ఎమ్మెల్యే సోదరులు టి.నరసింహాగౌడ్ టి.సుధాకర్ గౌడ్,కుటుంబ సభ్యులు ఉన్నారు.

## ఎంత ఎదిగిన గురువులను పూజించాలి..

**గురు చరణ్**



**నాంపల్లి,హైద్రాబాద్,జూలై 10(సూర్యరేఖ)** గురు పూర్ణిమ శుభ సందర్భంగా మహాత్మ జ్యోతి రావు పూలే యువ మంచ్ అధ్యక్షులు కేయం గురు చరణ్ తాను గురు వుగా భావించే జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గురు పూర్ణిమ రోజు గురువులను పూజించి వారి ఆశీస్సులను తీసుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. వేదాలను రచించిన వేద వ్యాసుడు కూడా ఆషాఢ పూర్ణిమ రోజున జన్మించాడని అందుకే ఈ రోజు వేదవ్యాసుని జయంతిగా కూడా జరుపుకుంటారని అన్నారు.భారతదేశ ప్రజలకు,సమస్త గురువులకు గురుపూర్ణిమ శుభాకాంక్షలు తెలిపారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం..

**జిల్లా కలెక్టర్**



**ముస్తాబాద్,జూలై 11(సూర్యరేఖ)** ముస్తాబాద్ మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా గురువారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు.మండల కేంద్రంలో రైతులకు సంబంధించిన కోరమాండల్,మన గ్రోమోర్ విక్రయ దుకాణాలను కలెక్టర్ తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా సేల్స్,స్టాక్ రిజిస్టర్లను,తనిఖీ చేయగా కోరమాండల్, మన గ్రోమోర్ గోదాములో యూరియా స్టాక్ లేవని,ఆ దుకాణానికి నోటీసులు ఇవ్వాలని అన్నారు.నకిలీ విత్తనాలు,ఎరువులు విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని,నాణ్యమైన విత్తనాలను మాత్రమే రైతులకు అందజేయాలని,కృత్రిమ కొరత సృష్టిస్తే విక్రయ యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమములో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జలిబెగం,మండల వ్యవసాయ అధికారి,దుర్గం రాజు జితేందర్ దుకాణపు యాజమానులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# బోనాల ఉత్సవాలకు ఏర్పాట్లను చేయాలి

మైలార్ దేవ్ పల్లి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్.వెంకటేష్



**రాజేంద్రనగర్,జులై10(సూర్యరేఖ)** బోనాల ఉత్సవాల్లో భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్ ను మైలార్ దేవ్ పల్లి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్.వెంకటేష్ కోరారు.ఈ మేరకు గురువారం ఎస్.వెంకటేష్ ఆధ్వర్యంలో జిహెచ్ఎంసి రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.రవికుమార్ ను కలిసి మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని వివిధ బస్తీలలో బోనాల పండగ ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా డివిజన్ లోని వివిధ బస్తీలల్లో ఉన్న గుంతల రోడ్ల కోసం ప్యాచ్ వర్క్స్ చేయాలని ప్రతీ బస్తీలల్లో కొత్త వీధి దీపాలు ఏర్పాటు చేసి అదేవిధంగా ప్రతీ దేవాలయాల దగ్గర డేలైట్లు ఏర్పాటు చేసి బస్తీలోపల,వీధి లైట్స్ మరమ్మత్తులు చేయాలన్నారు.నర్సాబాయ్ కుంటను డివిజన్ లోనే అతి సుందరంగా ఒక మంచి పార్క్ లా ఓపెన్ జిమ్ వాకింగ్ ట్రాక్స్ ఏర్పాటు చేసి పూల మొక్కలతో కూడిన గ్రీనరీని ఏర్పాటు చేసి అందుబాటులోకి తేవాలన్నారు. సాయిబాబానగర్ ఇందిరాగాంధీ విగ్రహం నుంచి శివరాంపల్లి రైల్వే గేట్ వరకు ఉన్న 100 ఫీట్ల రోడ్డును 30 ఫీట్లకు కుదించి రోడ్లను ఆక్రమించి ఉన్న వాణిజ్య వ్యవస్థలను తొలగించి దారిని పునరుద్దరించాలని కోరారు.ఈ మేరకు డీసీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.కలిసిన వారిలో యూత్ అధ్యక్షులు అక్కెం రాఘవేందర్ యాదవ్ బుదేవి ఎడ్లకాడి సూర్యం, కొంపల్లి జగదీష్,సురేష్ ముదిరాజ్ సునీల్ శంకర్ యాదవ్,తదితరులు పాల్గొన్నారు.

# సరస్వతీ శిశుమందిర్‌లో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు







**రాజేంద్రనగర్,జులై10(సూర్యరేఖ)** గురుపౌర్ణమి వేడుకలను పురస్కరించుకొని రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శివరాంపల్లి శ్రీసరస్వతి శిశు మందిర్ లో వేడుకలను నిర్వహించారు.ఈ వ్యాస పూర్ణిమ సందర్భంగా పాఠశాల అధ్యక్షులు పెండ్యాల చంద్రమోహన్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రబారి కే.బాల వంశీకృష్ణ,కోమటిరెడ్డి భీమ్ రెడ్డి,రాఘవేంద్ర స్కూల్ ప్రిన్సిపాల్,హారతి చక్రపాణి,శీల సంతోష్ గొట్టే అనిల్ ప్రధానాచార్యులు ఆచార్యబృందం విద్యార్థులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమం సందర్భంగా కె.బాలవంశీకృష్ణ విద్యా ర్థులకు గురు పౌర్ణిమ విశిష్టతను వివరించారు. ఇతర పెద్దలు కూడా విద్యార్థులు ఎలా ఉండాలి పెద్దవారితో ఎలా వ్యవహరించాలో,గురువు అంటే ఎవరో అనే భావన చాలా చక్కగా వివరించారు. విద్యార్థులకు గురువును ఎలా గౌరవించాలనే విషయాన్ని వివరించారు.ఏ సాధించాలన్న గురువుదే ప్రధానపాత్ర ఉంటుందన్నారు. తల్లిదండ్రుల తర్వాత గురువుకే మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. గురువులను గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రబంధకారిణి సభ్యులు కోమటిరెడ్డి భీమ్ రెడ్డిని సన్మానించారు. అనంతరం ప్రధానాచార్యులను కమిటీ సభ్యులు ఆచార్య బృందాన్ని తరగతి వారీగా విద్యార్థులు సన్మానించారు.

# కార్మికులకు ప్రమాదం జరిగితే మున్సిపల్ అధికారులదే బాధ్యత

రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి



**రాజేంద్రనగర్,జులై10(సూర్యరేఖ)** మున్సిపల్ కార్మికులకు ప్రమాదం జరిగితే మున్సిపల్ అధికారులే బాధ్యత వహించాలని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రత్నం,రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి,లు అన్నారు.రాజేంద్రనగర్ సర్కిల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నేషనల్ హైవే రోడ్డుపై సెంటర్ డివైడర్లకు కార్మికులతో పని చేయించకూడదని వారు అన్నారు.ఈ మేరకు గురువారం జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ శానిటేషన్ సిఎన్ రఘు ప్రసాద్ ను కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మున్సిపల్ అధికారులు నేషనల్ హైవే రోడ్డుపై సెంటర్ డివైడర్లకు కార్మికులతో పారిశుద్ధ్య పనులు చేయించడం జరుగుతుందన్నారు.కార్మికులకు ప్రమాదం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. వాహనాలు అతివేగంతో వచ్చే యాక్సిడెంట్లు అయ్యే ప్రమాదం ఉందని,ఎలాంటి భద్రత పాటించకుండా కార్మికుల ప్రాణాలతో చెలగాటం మాడుతున్నారు.కార్మికులకు ఏదైనా ప్రమాదం జరిగితే పూర్తి బాధ్యత మున్సిపల్ అధికారులే పూర్తి బాధ్యత వహించాలన్నారు.గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు 15 క్యాజువల్ లీవులు సర్కులర్ ఇవ్వడం జరిగిందని,కార్మికులకు క్యాజువల్ లీవులు వచ్చే విధంగా పేస్ స్కానింగ్ యాప్ లో ఆప్షన్ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.అడిషనల్ కమిషనర్ ఇచ్చిన సమస్యల మీద వెంటనే పరిష్కరిస్తానని స్పందించారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

## బుద్ధునితో నా ప్రయాణం నాటకం గోడ ప్రతులను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల,జులై10(సూర్య రేఖ)**"బుద్ధునితో నా ప్రయాణం" అనే తెలుగు నాటకం గోడ ప్రతులను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ గురువారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు మాట్లాడుతూ... అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఎం.కన్వెన్షన్ హాల్లో జులై 11న సాయంత్రం 6గంటలకు బుద్ధునితో నా ప్రయాణం అనే తెలుగు నాటకం ప్రదర్శన ఉన్నది. కావున పిల్లలు,పెద్దలు అంబేద్కర్,బౌద్ధ వాదులు, మేధావులు,దళిత బహుజన వాదులు అందరు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కూన రవి కుమార్,దాసరి వెంకటరమణ,సంకే శ్రీనివాస్,గొట్టే కుమార్,గొర్రె శ్రీనివాస్,తదితరులు హాజరయ్యారు.

## చండీ ఆశ్రమంలో వ్యాస పౌర్ణమి ఉత్సవాలు.



**కామారెడ్డి,జూలై10(సూర్యరేఖ)** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని చండీమాత ఆశ్రమంలో వ్యాస పౌర్ణమి ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు.ఉత్సవాల్లో భాగంగా యజ్ఞం,పాదుకాభిషేకాలు,పుష్పార్చన కీర్తనలు భజనలు చేశారు.అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.లింగాపూర్ వెంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కామారెడ్డి పాత సాయిబాబా మందిరంలో సాయిబాబా విగ్రహానికి పాలాభిషేకాలు చేశారు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా పలు విద్యాసంస్థల్లో గురువులను విద్యార్థులు సన్మానించారు.

## ఆయిల్ ఫామ్ పంట పెట్టే రైతులు వ్యవసాయ అధికారిని సంప్రదించాలి

రామాయంపేట మండల వ్యవసాయ అధికారి రాజ్ నారాయణ



**రామాయంపేట,జులై10(సూర్య రేఖ)** ఆయిల్ పామ్ పంట ఎవరైనా పెట్టాలని అనుకుంటే మా వ్యవసాయ శాఖకు వివరాలు వెంటనే తెలియజేయాలని గురువారం రామాయంపేట మండల వ్యవసాయ అధికారి రాజ్ నారాయణ తెలిపారు.ప్రభుత్వం సబ్సిడీ పైన మొక్కలు ఇస్తుందని ఒక మొక్కపూర్తి ధర రూ.230 అని వివరించారు.ప్రభుత్వం సబ్సిడీ పై కేవలం రూ.20 కే ఒక మొక్క ఇస్తుందన్నారు.ఎకరాకు 57 మొక్కలు ఇస్తారని,సబ్సిడీపై డ్రిప్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎస్సీ,ఎస్టీలకు 100 శాతం,బీసీలకు 90 శాతం,ఒసీలకు 80 శాతం సబ్సిడీ ఇస్తారన్నారు.4 సంవత్సరాల వరకు పెట్టుబడి ఖర్చులు ఎకరాకు రూ.4200 చొప్పున ఇస్తారని,4 సంవత్సరాల నుండి పంట దిగుబడి మొదలు అయి 30 సంవత్సరాల వరకు వస్తుందన్నారు.3 సంవత్సరాల వరకు మొక్కల మధ్యలో అంతర పంటలు వరి పంట తప్ప మిగతా అన్ని పంటలు సాగు చేసుకోవచ్చన్నారు.సిద్దిపేట జిల్లా నర్మెట్టలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ కూడా త్వరలో ప్రారంభం అవుతుందన్నారు.మార్కెటింగ్ కూడా కంపెనీ వారు రైతులతో అగ్రిమెంట్ చేసుకోవడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల రైతులు మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో సంప్రదించవచ్చని తెలియపరచారు.

## బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



**శీలం వెంకట్ రెడ్డికి ఘన సన్మానం..**

**రాజేంద్రనగర్,జులై10(సూర్యరేఖ)** గురుపౌర్ణమి వేడుకలలో పాల్గొనడం సంతోషంగా ఉందని ఎస్సీ మోర్చా పార్లమెంట్ కన్వీనర్ జోగు రవి,బిజెపి మైలార్‌దేవ్‌పల్లి–2 డివిజన్ అధ్యక్షుడు సూరెడ్డి వినయ్ రెడ్డి,లు అన్నారు.బిజెపి మైలార్‌దేవ్‌పల్లి–2 డివిజన్ అధ్యక్షుడు సూరెడ్డి వినయ్ రెడ్డి ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు,సన్మాన వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా గురుపౌర్ణమి ప్రాముఖ్యత గురించి సంక్షిప్త పరిచయం,ఉపాధ్యాయులు మార్గదర్శకులను గౌరవించడానికి,వారికి కృతజ్ఞతలు తెలిపడానికి ఒక రోజుగా ప్రముఖులుగా అభివర్ణించారు.అనంతరం శీలం వెంకట్ రెడ్డికి సన్మానం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...గురుపౌర్ణమి శుభ సందర్భంగా యువ మనస్సులను రూపొందించడానికి తన జీవితంలోని స్వర్ణ సంవత్సరాలను అంకితం చేసిన వ్యక్తిని సత్కరించడం మాకు గౌరవంగా భావిస్తున్నామన్నారు.శీలం వెంకట్ రెడ్డి గగన్‌పహాడ్ ప్రభుత్వ పాఠశాలలో గణితం ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేశారని,ఉచితంగా సేవలందించారన్నారు. అక్కడ ఆయన వందలాది మంది విద్యార్థులను తన అంకితభావం, క్రమశిక్షణ దయతో ప్రేరేపించారన్నారు.న్యాయవాదిగా న్యాయవాద వృత్తిలోకి మారిన తర్వాత కూడా గురువుగా ఆయన గుర్తింపు ప్రకాశిస్తూనే ఉందన్నారు. గగన్‌పహాడ్ సమాజం తరపున,ఆయన పూర్వ విద్యార్థులందరి తరపున, ఈ సన్మానాన్ని ప్రదర్శించడంలో తాము ఎంతో గర్విస్తున్నామన్నారు. టీచింగ్ జర్నీపై ప్రతిబింబాలు,జ్ఞాపకాలను పంచుకోవడం,యువతకు ప్రోత్సాహకరమైన పదాలని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఓబిసి నాయకుడు అడికె రాజు,వల్లూరి శ్రీనివాస్,బళ్ల శ్రీనివాస్ యాదవ్,గూడూరు అంజి,గుర్రం గణేష్,జె.వినయ్ కుమార్,రాఘవేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మై ఆటో ఈస్ సేఫ్ యాప్ లో నమోదు చేసుకోవాలి







**రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ ఏ.బాలాజీ**

**రాజేంద్రనగర్,జులై10(సూర్యరేఖ)**రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో తిరిగే ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా వాహనాల చట్టం రూల్ 269,270 ప్రకారం నమోదు చేసుకోవాలని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ ఏ.బాలాజీ అన్నారు.ఈ విషయంపై నిర్వహించి డ్రైవ్ లో ఆయన ట్రాఫిక్ సిబ్బందితో కలిసి ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఏసీపీ ఏ.బాలాజీ మాట్లాడుతూ...రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో తిరుగుతున్న ఆటో డ్రైవర్లు తమ ఆటో ఆర్‌సీ,లైసెన్స్,ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు తీసుకొని రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ కు వచ్చి,మై ఆటో ఈస్ సేఫ్ యాప్ లో మోటారు వాహనాల చట్టం రూల్ 269,270 ప్రకారము నమోదు చేసుకోవాలన్నారు.నమోదు చేసుకున్న ఆటోలో ప్రయాణించే మహిళలు వృద్ధులు,చిన్నారులకు పూర్తి భద్రత ఉంటుందన్నారు.నమోదు చేసుకున్న ఆటో ఎవరైనా చోరీ చేసినా,చోరీ చేసిన ఆటో ఎక్కడ ఉన్నది ఆటోపై అతికించిన స్టికర్ ద్వారా పోలీస్ వారు గుర్తించి ఆటో ఓనర్ కు అప్పగిస్తారన్నారు. అలా నమోదు చేసుకున్న వారికి 3 స్టిక్కర్లను ఇచ్చి,వాటిలో ఒక దానిని ఆటో ముందు భాగంలో 2వ స్టిక్కర్ ను ఆటో వెనకభాగంలో(సీసీ కెమెరా క్యాప్చర్ అయ్యేవిధంగా) 3వ స్టిక్కర్ డ్రైవరు సీటు వెనక (ఆటోలో ప్రయాణించే ప్రయాణికులకు కనిపించే విధంగా) అతికించుకోవాలన్నారు. ఆటో డ్రైవరు సీటు వెనుక భాగంలో అతికించిన స్టిక్కర్ లోని స్కానర్ ను ప్రయాణికులు తమ స్మార్ట్ ఫోన్ లలో స్కాన్ చేయడం వల్ల ఆటో పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు.ఆ ఆటోలో తాము ప్రయాణిస్తున్న సమయంలో డ్రైవరుపై అనుమానము వచ్చిన వారు పోలీసు వారికి ఫిర్యాదు చేయవచ్చున్నారు.కావున రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో తిరిగే ఆటో డ్రైవర్లు ఖచ్చితంగా తమ ఆటోలను యాప్ లో నమోదు చేసుకోవాలన్నారు.లేనిచో ఆ ఆటోలు ఏరియాలో తిరిగే అవకాశం లేదని,ప్రయాణికులు వారి భద్రత దృష్ట్యా ఎవరూ స్టిక్కర్లు లేని ఆటోలలో ప్రయాణించకూడదని పోలీసు వారు కోరారారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సీహెచ్.రాజు,చేవెళ్ళ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఎస్.వెంకటేష్,సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నా







**మైలార్ దేవ్ పల్లి డివిజన్ సమగ్రాభివృద్ధే లక్ష్యం..**
**సమస్యల శాశ్వత ప్రతిపదికన పరిష్కరిస్తాం..**
**రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్,డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి**

**రాజేంద్రనగర్,జులై10(సూర్యరేఖ)**ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తూ మైలార్ దేవ్ పల్లి డివిజన్ ను అభివృద్ధి చేస్తున్నానని రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.గురువారం రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని మైలార్ దేవ్ పల్లి డివిజన్ ఆప్కో కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్లను జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ. మైలార్ దేవ్ పల్లి డివిజన్ లో సమస్యలను శాశ్వత ప్రతిపాదికన పరిష్కరించడం జరుగుతుందని వెల్లడించారు. దశలవారీగా కాలనీలలో అభివృద్ధి పనులు చేపడుతూ ప్రజలకు పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.అభివృద్ధి పనుల్లో రాజీపడే ప్రసక్తే లేదన్నారు.నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలపై వారిచ్చే వినతులను స్వీకరించి,పరిష్కార చర్యలు చేపడుతున్నట్లు సూచించారు.నాణ్యత పాటిస్తూ లోపాలు లేకుండా పనులు పూర్తి చేయాలని అన్నారు.రానున్న బోనాలలోపు పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రానున్న బోనాలు దృష్టిలో ఉంచుకొని దేవాలయ పరిసరాల్లో అవసరం ఉన్న చోట ప్యాచ్ వర్క్ మరమ్మతు పనులు నిర్వహించాలని అధికారులు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సిబ్బంది ఏఈ నరసింహమూర్తి,వర్క్ ఇన్స్పెక్టర్ రాహుల్ బుచ్చిరెడ్డి ఎల్వీ రెడ్డి సురేష్,నరేష్ యాదవ్ మన్మోహన్ రెడ్డి మధుసూదన్ రెడ్డి సతీష్ శంకర్ నారాయణ శాంతమ్మ పారిజాతం లక్ష్మి ఎస్ఎఫ్ఐ జాషువా తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ రామ కృష్ణవైదిక ధర్మపీఠం వేద పాఠశాలలో గురు పౌర్ణమి వేడుకలు



**కామారెడ్డి,జూలై10(సూర్య రేఖ)** శ్రీ విశ్వ జ్యోతిర్లింగ పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ రామదుగు నరసింహ్మా చార్య గురుదేవుల పాదపూజా కార్యక్రమాన్ని వేద పాఠశాల విద్యార్థులు నిర్వహించారు.ఈ సందర్భంగా చైర్మన్ శీర్లవంచ కృష్ణమాచార్యులు గురువు ఆశీస్సులతో ప్రతి సంవత్సరం గురు పాదుక పూజ నిర్వహించడం జరుగుతుందన్నారు.ఇక్కడ మూడవ ఉపపిఠాధిగా ఉన్న కృష్ణమాచార్యులు మేము అన్ని కులాల వారికి వేదం అందించడమే మా లక్ష్యం కనుక డబ్బులతో పనీలేదు ఎవ్వరైనా రావచ్చున్నారు.మూడు సంవత్సరాల వరకు ఫ్రీగా పాఠశాలలో అనుమతి ఉంటుందని,హిందూ ధర్మ ప్రచారమే తమ ధ్యేయమన్నారు.ఈ కార్యక్రమంలో జ్యోతిలింగ పీఠాధిపతి శిష్యులు లింగమాచారి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నూతన అనుభూతి పొందినట్టు గురువు అమెరికాలో ఉన్న ఇక్కడే ఉన్నట్టు అనుభూతి పొందానని అన్నారు.ఇది నా భాగ్యంగా భావిస్తున్నానన్నారు.ఈ కార్యక్రమంలో వేద పాఠశాల విద్యార్థులు చరణ్ వర్మ ధనుష్ అప్ప,సూరజ్ ఆచార్య యశ్వంత్ శర్మ,నిక్షిత్ అప్ప,రిషిక్ అప్ప కార్తీ విశ్రుత్ అప్ప,విగ్నేష్ శర్మ,అంత్రిక్ష్ అప్ప,మన్మధ స్వామి ఓంకార్ భరత్,అన్విత్,మన్మధ్ అప్ప తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ మాట తప్పదు

**పాక జ్ఞానేశ్వరి రవి ప్రసాద్**



**కామారెడ్డి,జూలై10(సూర్య రేఖ)** స్థానిక సంస్థల ఎన్నికలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తామని చెప్పడం హర్షనీయమని కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు పాక జ్ఞానేశ్వరి రవి ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పార్టీ మాట ఇచ్చిందంటే చేసి చూపిస్తుందని ఆమె అన్నారు.బీసీలకు రాజకీయంగా 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని గతంలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని ఇప్పుడు అసెంబ్లీలో బిల్లు ఆమోదించి త్వరలో ఆర్డినెన్స్ ద్వారా చట్టాన్ని సవరిస్తామని ఆమె వెల్లడించారు.గత భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం బీసీలు అణగారిన వర్గాలకు తీవ్ర నష్టం చేసిందని ఆమె అన్నారు.కాంగ్రెస్ పార్టీ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని,దీంతో బీసీలు రాజకీయంగా విద్య,ఉపాధిపరంగా బీసీలు ముందుకు వెళ్తారని ఆమె అన్నారు.

## హైస్కూల్ లెవెల్ చదివే ప్రతి విద్యార్థి అభ్యసనా సామర్థ్యాల మెరుగుకు ఉపాధ్యాయలు కృషి చేయాలి..

**తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మెనేజ్మెంట్ అసోసియెషన్ (ట్రస్మా) ఆసిఫ్ నగర్ మండల కమిటీ అధ్యక్షులు రవికుమార్ కాపూరి**



**నాంపల్లి,హైద్రాబాద్,జూలై10 (సూర్యరేఖ)** పాఠశాలల్లో హైస్కూల్ లెవెల్ చదివే ప్రతి విద్యార్థుల కనీస అభ్యాసన సామర్థ్యం మెరుగుకు కృషి చేయాలని తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మెనేజ్మెంట్ అసోసియెషన్ (ట్రస్మా) ఆసిఫ్ నగర్ మండల కమిటీ అధ్యక్షులు, రవికుమార్ కాపూరి తెలిపారు. గురువారం గుడిమల్కాపూర్ తాళ్ళగడ్డ శివబాగ్ ప్రాంతంలోని న్యూజెన్ హైస్కుల్ లో జరిగిన సమావేశంలో ప్రధాన ఉపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు హితవుపలికారు.ఈ సందర్భంగా (ట్రస్మా) ఆసిఫ్ నగర్ మండల కమిటీ అధ్యక్షులు రవికుమార్ కాపూరి మాట్లాడుతూ..హైస్కూల్ లెవెల్ ప్రతి విద్యార్థికి తరగతికి సంబంధించిన అభ్యసన సామర్థ్యాలు సాధించే విధంగా ప్రతి ఒక్క ఉపాధ్యాయులు కృషి చేయాలని,దానికి ప్రధానోపాధ్యాయులు సహకరించాలన్నారు. విద్యార్థులల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసినప్పుడే ఉపాధ్యాయ వృత్తికి సార్ధకమన్నారు. అలాగే పాఠశాలల్లో జరుగుతున్న స్కిల్ బేసిక్ ఎడ్యుకేషన్ మీద ప్రత్యేక శ్రద్ధ చూపాలని,పదవ తరగతి విద్యార్థుల కోసం అదనపు తరగతుల నిర్వహించి విద్యార్థులలోని సందేహాలను నివృత్తి చేయాలని రవికుమార్ కాపూరి ఉపాధ్యాయలకు హితబోధ చేశారు.

# గురు పౌర్ణమి వేడుకల్లో గురువులను గౌరవించుకోవడం గొప్ప విషయం





**రాజేంద్రనగర్ నియోజక వర్గ ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి**

**రాజేంద్రనగర్,జులై10(సూర్యరేఖ)** గురుపౌర్ణమి వేడుకల్లో గురువులను గౌరవించుకోవడం గొప్ప విషయమని రాజేంద్రనగర్ నియోజక వర్గ ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు.రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని మైలార్ దేవ్ పల్లి డివిజన్ కాటేదాన్ బీజేపీ పార్టీ కార్యాలయంలో గురుపౌర్ణమి వేడుకలను బిజెపి పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా డివిజన్లోని ముఖ్య నాయకులతో కలిసి పలువురు గురువులను ఘనంగా సత్కరించి సన్మానించారు.ప్రజలందరికీ గురు పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ...ఇంత మంచి కార్యక్రమాన్ని గురువులను గౌరవించుకునే విధంగా నిర్వహించుకుంటుండటం చాలా సంతోషంగా ఉందని అన్నారు.గురువు లేకుండా విద్య ఉండదు,విద్య లేకుండా జీవితం కష్ట సాధ్యమని తెలిపారు.మన జీవిన దారిలో ప్రతి అడుగున వెలుగునిచ్చే గురువులకు శత కోటి వందనాలని తెలిపారు.మన జీవితాలను సన్మార్గంలో నడిపి మనకు విలువలను,మంచి ప్రవర్తనను నేర్పించి మంచి మార్గంలో నడిపేది గురువులే అన్నారు. గురువు బాటలో నడిస్తే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అందుకునేందుకు వీలుంటుందని తెలిపారు. గురువులందరినీ గౌరవించుకోవడం మన బాధ్యత అని పేర్కొన్నారు.అందరి జీవితాలను తీర్చిదిద్దే గురువులన్నారు. గురువుల సేవలు చాలా గొప్పవి మరువలేనివన్నారు.ఈ కార్యక్రమంలో యోగా గురువు భద్రయ్య, విశ్వకర్మ టెంపుల్ రామకృష్ణ చారి,ఉపాధ్యాయులు మాణిక్యం రెడ్డి,పాండిత్య గురువులు జీవన్ షా,మిస్టర్ ఇండియా రాకేష్ యోగా గురువు వెంకటేశ్వర్లు,డివిజన్లోని ముఖ్య నాయకులు జోగి రవి,బుచ్చిరెడ్డి,డివిజన్ మాజీ అధ్యక్షుడు అడికే జనార్ధన్ సంతోష్ గౌడ్,ఎన్ను శ్రీనివాస్ రెడ్డి,తలారి చిన్న,బబ్లు,ఎల్వీ రెడ్డి,అడికె రాజు,బి.నరసింహ మధుసూదన్ రెడ్డి మజార్ ప్రభుదాస్ రామా రావు,సురేష్,పొప్పట్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగంలో సేవలకు గుర్తింపుగా గౌరవ డాక్టరేట్ పురస్కారం

**రాపోలు విష్ణువర్ధన్ రావుకు హెూప్ థియోలాజికల్ యూనివర్సిటీ నుండి డాక్టరేట్**



**మంచిర్యాల,జులై10(సూర్యరేఖ)** విద్యారంగ సమస్యల పరిష్కారానికి గత 27 సంవత్సరాలుగా నిరంతరం పోరాడుతూ,సంఘ బలోపేతానికి విశేష కృషి చేస్తూ,కరోనా కాలం నుండి వారు చేస్తున్న సామాజిక సేవలను గుర్తించి హెూప్ థియోలాజికల్ యూనివర్సిటీ వారు మంచిర్యాల జిల్లా వాసి ప్రముఖ విద్యావేత్త రాపోలు విష్ణువర్ధన్ రావుకు గౌరవ డాక్టరేట్ పురస్కారం అందజేశారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ...మంచిర్యాల జిల్లాలో పరిచయం అవసరం లేని పేరు రాపోలు విష్ణువర్ధన్ రావు అని, తారతమ్య భేదాలు లేకుండా కుల మత ప్రాంతాలకు అతీతంగా ప్రతీ ఒక్కరిని అక్కున చేర్చుకున్న సహృదయుడు,నిగర్వి,సేవా తత్పరుడు రాపోలు విష్ణువర్ధన్ రావు అని అన్నారు.1998లో ప్రముఖ ప్రైవేట్ కళాశాలలో గణిత అధ్యాకునిగా విద్యా బోధన ఆరంభించి ఎంతో మంది విద్యార్థులు ఉన్నతస్థాయిలో ఉంచేందుకు కృషి చేశారనీ తెలిపారు.ఆ తర్వాత 2003లో ఒక ప్రైవేట్ కాలేజీ స్థాపించి,తర్వాత 2011 నుండి రివిలేషన్ పాఠశాలను నడిపిస్తూనే 2024లో గుడి పేటలో రివిలేషన్ ఫ్యూచర్ మైండ్స్ పాఠశాలను స్థాపించారని తెలిపారు.గతంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రైవేట్ జూనియర్ కాలేజ్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ప్రైవేట్ జూనియర్ కాలేజీలలో పనిచేసే లెక్చరర్ల సమస్యలపై,తెలంగాణా ప్రైవేట్ జూనియర్ కాలేజీల యాజమాన్యాల సంఘం (టిపిజెఎంఏ) జిల్లా అధ్యక్షునిగా ప్రైవేట్ జూనియర్ కాలేజీల సమస్యలపై పోరాటం చేశారని తెలిపారు. ఆ తర్వాత మంచిర్యాల జిల్లా తెలంగాణ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం (ట్రస్మా)జిల్లా అధ్యక్షుడిగా ఎన్నో సేవలు అందించిన మహెూన్నత వ్యక్తి అని అన్నారు.ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం ట్రస్మా జిల్లా అధ్యక్షుడిగా ఉన్నప్పటికీ ఆ పాఠశాలలో పనిచేసే బోధన, బోధనేతర సిబ్బందికి కరోనాసమయంలో యాజమాన్యాల సహకారంతో ఎంతో కాలం వారికి నిత్యవసర సరుకులు అందించి వారిని ఆదుకున్నారు.అదేవిధంగా అప్పటి రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాల తోటి సంప్రదించి వారికి కొంతకాలం నిరుద్యోగ భృతి ఇవ్వడంలో కూడా సఫలీకృతులయ్యారని,యాజమాన్యాలకి ప్రతీ విషయంలో చేదోడు వాదోడుగా ఉంటూ,ప్రైవేట్ పాఠశాలకు పది సంవత్సరాల రెన్యువల్ రికగ్నైజేషన్ ఇప్పించడంలో వీరు ముందున్నారని ఫైర్ సేఫ్టీ రిలాక్సేషన్ కావచ్చు తదితర అనేక రకాలైనటువంటి విషయాలలో వారు ముందుండి తోటి కరస్పాండెంట్స్ కి వెన్నుదన్నుగా నిలిచారని ఏ రాజకీయ పార్టీకి అనుగుణంగా కాకుండా,మరే రాజకీయ పార్టీకి వ్యతిరేకంగా కాకుండా అందరితో కలిసి మెలిసి ఉంటూ అందరివాడిగా పేరు తెచ్చుకున్న వ్యక్తి రాపోలు విష్ణువర్ధన్ రావు అని వారి సేవలను గుర్తించి ప్రఖ్యాత విశ్వవిద్యాలయం హెూప్ ఆఫ్ థియలాజికల్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ను ప్రధానం చేయడం జరిగిందని తెలిపారు.ఇది వారికే కాదు యావత్ మంచిర్యాల జిల్లాకే గర్వకారణం అని పలువురు ప్రశంసించారు. పుష్పగుచ్ఛాలతో, శాలువాలతో రాపోలు విష్ణువర్ధన్ రావుని విద్యాసంస్థల యాజమాన్యాలు సన్మానించి తమ హర్షాన్ని వ్యక్తం చేశారు.ప్రైవేట్ విద్యా సంస్థల కోసం గత 27 సంవత్సరాల నుండి చేస్తున్న అత్యున్నత సేవలను కొనసాగించడంతో పాటు సమాజ సేవ పట్ల వారి నిస్వార్థ సేవ నిబద్ధత, అలసటలేని కృషి,మంచి సంకల్పబలంతో వారు చేసిన సేవలకు ఇది న్యాయమైన గుర్తింపు అని,ఈ గౌరవం వారు చేసిన మానవ సేవలకు ప్రతిబింబమే కాక,సమాజాన్ని మార్చాలని ఆశించే ప్రతి ఒక్కరికీ ప్రేరణకు మార్గదర్శకం అని స్పష్టం చేశారు.

# మాధవానంద సరస్వతి స్వామి ఆశీస్సులు తీసుకున్న నర్సాపూర్ ఎమ్మెల్యే




**కొల్చారం,జులై10(సూర్యరేఖ)** మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని రంగంపేట గ్రామ శివారులో ఉన్న పీఠాదిపతి శ్రీమాధవానంద సరస్వతి ఆశ్రమాన్ని ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి గురువారం సందర్శించారు.అనంతరం పీఠంలోని దేవతా మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి మాధవానంద సరస్వతి స్వామి శుభా ఆశీస్సులు తీసుకున్నారు.అనంతరం కొల్చారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 12 మంది లబ్ధిదారులకు రూ.9.30 లక్షల చెక్కులను అందజేశారు.ఈ కార్యక్రమంలో కొల్చారం మండలం బీఆర్ఎస్ పార్టీ యువత అధ్యక్షులు కోనాపూర్ సంతోష్ రావు సీనియర్ నాయకుడు అరిగే రమేష్ కుమార్,యువ నాయకుడు రవితేజ రెడ్డి,తాజా మాజీ జెడ్పీటీసీ ముత్యంగారి సంతోష్ మేఘమాల,నరేందర్ రెడ్డి, బాగారెడ్డి,మండల పార్టీ అధ్యక్షులు గౌరీ శంకర్ గుప్త, నరేందర్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డిలో ఎండు గంజాయి పట్టివేత.



**కామారెడ్డి,జూలై10(సూర్యరేఖ)** కామారెడ్డి మండలం నరసన్న పల్లె రైల్వే గేట్ వద్ద 550 గ్రాముల ఎండు గంజాయిని ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు.అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..చిన్న ప్యాకెట్లలో ఎండు గంజాయి సరఫరా చేస్తున్నారని సమాచారంతో ఎక్సైజ్ సీఐ సుందర్ సింగ్ ఆధ్వర్యంలో గురువారం నరసన్న పల్లె రైల్వే గేటు వద్ద వాహనాలు తనిఖీలు చేపట్టారు. కామారెడ్డి పట్టణంలో నివాసం ఉంటున్న అహ్మద్ బీన్ అసాద్ అనే వ్యక్తి బైక్ పై గంజాయిని తీసుకొని వెళు తుండగా పట్టుకున్నారు.ఈ మేరకు నిందితుడిని అరెస్టు చేసి బైకును సీజ్ చేశామని ఎక్సైజ్ అధికారులు తెలిపారు.తనికెల్లో సబ్ ఇన్స్పెక్టర్ శరత్ కుమార్,హెడ్ కానిస్టేబుల్ బాల్ రెడ్డి,కానిస్టేబుల్ మారుతి,శ్రీనివాస్ రెడ్డి,నవీన్ కుమార్,సరిత, అపూర్వ,తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీ రంగంపేట పీఠాధిపతి మాధవనంద స్వామి ఆశీస్సులు తీసుకున్న....

**- తెలుగుదేశం పార్టీ పార్లమెంటు అధ్యక్షులు ఇల్లందుల రమేష్...**



**కొల్చారం,జులై10(సూర్య రేఖ):** గురుపౌర్ణమి సందర్భంగా గురువారం మెదక్ జిల్లా కొల్చారం మండలం పరిధిలోని రంగంపేట శ్రీశ్రీ గురు మాదానంద స్వామి ఆశీస్సులను తెలుగుదేశం పార్టీ పార్లమెంటు అధ్యక్షులు ఇల్లందుల రమేష్ తీసుకున్నారు.పార్లమెంట్ ఆర్గనైజర్ సెక్రటరీ మల్లేశం గౌడ్ ఆధ్వర్యంలో గురు మాధవానంద స్వామి ఆశీస్సులు తీసుకున్నారు.అలాగే పుణ్యక్షేత్రమైన ఏడుపాయల దుర్గ భవాని ఆశీస్సులు కూడా తీసుకున్నట్లు పార్లమెంట్ ఆర్గనైజర్ సెక్రెటరీ మల్లేశం గౌడ్ తెలిపారు.

## రంగంపేట మాధవానంద ఆశ్రమంలో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

**పాల్గొన్న ఎంపీ రఘునందన్ రావు...**



**కొల్చారం,జులై10(సూర్య రేఖ):**కొల్చారం మండలంలోని రంగంపేట గ్రామంలో మాధవానంద ఆశ్రమంలో గురుపౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి జిల్లాతో పాటు రాష్ట్ర నలుమూలల నుండి పెద్ద ఎత్తున భక్తులు వచ్చి శ్రీశ్రీ మాధవానంద సరస్వతి ని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి మాధవానంద సరస్వ తి ఆశీర్వాదం తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు,కొల్చారం మండల బిజెపి పార్టీ అధ్యక్షులు పంతులు హరీష్,మాజీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళి యాదవ్,రాష్ట్ర ఓబిసి పోచయ్య బిజెపి పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# విడాకుల వార్తలపై స్పందించిన నయనతార.. ఒక్క ఫొటోతో రూమర్స్‌కి చెక్

'లేడీ సూపర్ స్టార్' నయనతార తన భర్త విఘ్నేశ్ శివన్‌తో విడాకులు తీసుకోబోతుందని గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ వార్తలకు చెక్ పెడుతూ తన భర్తతో అన్యోన్యంగా ఉన్న ఫొటోను షేర్ చేసింది. నయనతార ఇటీవల తన సోషల్ మీడియా స్టోరీస్‌లో ఒక పోస్ట్ షేర్ చేసింది. అందులో.. తెలివి తక్కువ వ్యక్తిని పెళ్లి చేసుకున్నప్పుడు, మ్యారేజ్ అనేది పెద్ద మిస్టేక్. నీ భర్త చేసే పనులకు నువ్వు బాధ్యత వహించాల్సిన అవసరం లేదు. ఎందుకంటే పురుషులు సాధారణంగా మెచ్యూర్ కాదు. నన్ను ఒంటరిగా వదిలేయండి. నేను ఆల్రెడీ చాలా మీవల్ల ఫేస్ చేశా అంటూ రాసుకోచ్చింది. అయితే ఈ పోస్టును నయన్ కొద్దిసేపటికే డిలీట్ చేసినప్పటికీ, అప్పటికే స్క్రీన్‌షాట్‌ల రూపంలో వైరల్ అయి, నయనతార-విఘ్నేష్ శివన్ మధ్య విభేదాలు తలెత్తాయని, విడాకులు తీసుకోబోతున్నారనే ప్రచారానికి దారితీసింది. ఈ వార్తలు వైరలయ్యిన వెంటనే, నయనతార తన భర్త విఘ్నేష్ శివన్, పిల్లలతో కలిసి పళని సుబ్రహ్మణ్యస్వామి ఆలయాన్ని సందర్శించి అందరి దృష్టిని ఆకర్షించింది. ఆలయంలో దంపతులిద్దరూ కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి, సాష్టాంగ నమస్కారాలు చేశారు. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, వారి మధ్య ఎలాంటి మనస్పర్థలు లేవని, విడాకుల వార్తలు అవాస్తవమని స్పష్టమైంది. అయితే తాజాగా తన విడాకుల వార్తలపై మరోసారి స్పందించింది నయనతార.. తాజాగా నయన్ తన సోషల్ మీడియాలో విఘ్నేష్ శివన్ నేలపై పడుకుని ఉండగా, ఆయనపై ఎక్కి కూర్చున్న ఒక ఫోటోను షేర్ చేస్తూ, "మా గురించి కొన్ని పనికిమాలిన వార్తలు చూస్తున్నప్పుడు మా రియాక్షన్ ఇలాగే ఉంటుంది" అంటూ క్యాప్షన్ ఇచ్చింది.

# ఐరెన్ లెగ్ అన్నారు.. రాత్రికి రాత్రే 9 ప్రాజెక్ట్స్ నుంచి తీసేశారు.. ఇప్పుడు ఇలా..



సాధారణంగా సినీరంగంలో నటీనటులుగా రాణించడం అంత సులభం కాదు. ముఖ్యంగా హీరోయిన్స్ అనేక అవమానాలు, సవాళ్లను ఎదుర్కొని.. ఇప్పుడు ఇండస్ట్రీలో రాణిస్తున్నారు. ప్రస్తుతం స్టార్ హోదాలో ఉన్న తారలు చాలా కాలంగా ఒక్క సరైన అవకాశం కోసం ఎదురుచూసినవాళ్లే. వచ్చిన ప్రతి ఆఫర్ ఉపయోగించుకుని సహజ నటనతో ప్రేక్షకులను హృదయాలను గెలుచుకున్నారు. అందం, అభినయంతో ఇండస్ట్రీలో తమదైన ముద్రవేసినవారే. ప్రస్తుతం సినీరంగంలో అగ్రకథానాయికగా దూసుకుపోతున్న ఓ హీరోయిన్ కెరీర్ తొలినాళ్లల్లో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నానని.. తనను ఐరెన్ లెగ్ అనే ముద్ర వేశారని.. దీంతో రాత్రికి రాత్రే తనను 9 ప్రాజెక్ట్స్ నుంచి తీసేశారని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఆమె పాన్ ఇండియా టాప్ హీరోయిన్?గా రాణిస్తుంది. ఇంతకీ ఆమె ఎవరో తెలుసా.. ? తనే హీరోయిన్ విద్యాబాలన్. తాజాగా ఓ యూట్యూబ్ ఛానల్?కు ఇచ్చిన ఇంటర్వ్యూలో విద్యా బాలన్ మాట్లాడుతూ.. "కెరీర్ మొదట్లో హీరో మోహన్ లాల్ జోడిగా చక్రం సినిమాలో నటించే ఛాన్స్ వచ్చింది.. షూటింగ్ స్టార్ట్ అయిన కొన్ని రోజులకే ఆ ప్రాజెక్ట్ ఆగిపోయింది. అందుకు నేను కారణం అంటూ ప్రచారం జరిగింది. దీంతో నాపై ఐరెన్ లెగ్ అనే ముద్ర వేసి నాపై విమర్శలు చేశారు. ఆ ఒక్క సినిమా ఆగిపోయిందని తెలిసి రాత్రికి రాత్రే నన్ను 9 ప్రాజెక్ట్స్ నుంచి తొలగించారు. అసలు ఆ సినిమా ఆగిపోవడానికి నేను కారణం కాదు. ఆ సినిమా డైరెక్టర్, మోహన్ లాల్ మధ్య అభిప్రాయ బేధాలు రావడంతో ఆ ప్రాజెక్ట్ ఆపేశారు. కానీ ఆ సినిమా నా కెరీర్ పై ఎంతో ప్రభావం చూపించింది" అంటూ చెప్పుకొచ్చింది.




## ఓటీటీలో 'మోతేవరి లవ్‌స్టోరీ'.. టైటిల్ కొత్తగా ఉందన్న ఆనంద్ దేవరకొండ

అనిల్ జీలా, వర్షిణి రెడ్డి జున్నుతుల ప్రధాన పాత్రల్లో నటించిన తాజా వెబ్ సిరీస్ 'మోతేవరి లవ్‌స్టోరీ'. ఈ సిరీస్‌ను శివ కృష్ణ బుర్రా రూపొందించారు. ఏడు ఎపిసోడ్స్‌గా తెరకెక్కిన ఈ విలేజ్ కామెడీ, లవ్ సిరీస్ ఆగస్ట్ 8 నుంచి ప్రముఖ ఓటీటీ జీ5లో స్ట్రీమింగ్ కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఈ సిరీస్‌కు సంబంధించిన పోస్టర్‌ను మేకర్లు రిలీజ్ చేశారు. నటుడు ఆనంద్ దేవరకొండ ఈ కార్యక్రమానికి హాజరై పోస్టర్, టైటిల్‌ను అధికారికంగా ఆవిష్కరించారు. లంబాడిపల్లి అనే గ్రామంలోని ఇద్దరు సోదరులు, స్వర్గస్తులైన తండ్రి ఓ మహిళకు రాసిచ్చిన ఐదు ఎకరాల భూమి, రహస్యంగా ప్రేమించుకుంటున్న సత్తయ్య కుమార్తె అనిత (వర్షిణి రెడ్డి జున్నుతుల), అనుమవ్వ మనవడు పార్షి (అనిల్ జీలా) జంట, ఈ భూ వివాదం, కుటుంబ గర్వం, వారసత్వం మధ్య సాగే ఈ సిరీస్ ఆద్యంతం అందరినీ అలరించేలా ఉంటుంది. ఈ ప్రేమకు వచ్చిన అడ్డంకులు ఏంటి? అన్నది ఆసక్తికరంగా ఉంటుంది. ఇక ఈ టైటిల్, పోస్టర్ రిలీజ్ అనంతరం.. ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ .. 'నాకు చిన్న సినిమా, పెద్ద సినిమా.. చిన్న సిరీస్, పెద్ద సిరీస్ అని అనడం నాకు నచ్చదు. 'మోతెవరి లవ్ స్టోరీ' అనే టైటిల్, పోస్టర్ చాలా కొత్తగా ఉంది. నాకు ఇలా ఈవెంట్లకు రావడం కాస్త భయం. కానీ అనిల్ పిలిచిన వెంటనే రావాలని అనిపించింది. నేను యూఎస్‌లో ఉన్నప్పుడు ఎక్కువగా అక్కడి వారు మై విలేజ్ షో కంటెంట్‌ను చూసేవాళ్లు. నేను కూడా ఫాలో అయ్యేవాడ్ని. మధుర శ్రీధర్ గారు నా దొరసాని సినిమాను నిర్మించి నాకు గొప్ప అవకాశం ఇచ్చారు. ఆ మూవీకి మై విలేజ్ షో కంటెంట్ చూసే డైలాగ్స్, యాసను నేర్చుకున్నాను. నా జర్నీలో మై విలేజ్ షో టీం పాత్ర చాలా ఉంది. ఈ సిరీస్ కోసం పని చేసిన ప్రతీ ఒక్కరికీ పెద్ద సక్సెస్ రావాలి. ఈ సిరీస్‌కు సీక్వెల్స్ వస్తూనే ఉండాలి. సక్సెస్ అవుతూనే ఉండాలి' అని అన్నారు. అనిల్ జీలా మాట్లాడుతూ ..'మా 'మై విలేజ్ షో' టీం నుంచి మొదటి సారిగా ఇలా సిరీస్ చేశాం. మధుర శ్రీధర్ గారు మొదటి సిట్టింగ్‌కే కథను ఓకే చేశారు. జీ5 టీం వల్లే ఈ సిరీస్ ఇంత బాగా వచ్చింది. మేం ఇప్పటి వరకు ఎన్నో సార్లు చూశాం. ఆద్యంతం నవ్వుకుంటూనే ఉన్నాం. నన్ను విజయ్ దేవరకొండ అన్ననే సినిమాల్లోకి తీసుకు వచ్చారు. ఇప్పుడు నా కోసం వచ్చిన ఆనంద్ అన్నకి థాంక్స్. మా సిరీస్ ఆగస్ట్ 8న రాబోతోంది. అందరూ చూడండి' అని అన్నారు.




# 'కేడీ ది డెవిల్' భారీ యాక్షన్ సినిమా (టీజర్)

కన్నడ చిత్ర పరిశ్రమ నుంచి మరో పాన్ ఇండియా చిత్రం 'కేడీ ది డెవిల్' రాబోతుంది. తాజాగా టీజర్ విడుదల చేశారు. ఒకప్పుడు కర్ణాటక రాష్ట్రానికే పరిమితం అయిన కన్నడ త్ర పరిశ్రమ ఇప్పుడు పాన్ ఇండియా స్థాయిలో దుమ్మురేపుతోంది. కేజీఎఫ్, కేజీఎఫ్%-%2, విక్రాంత్ రోణా, చార్లీ 777, కాంతార తదితర చిత్రాలు ఇతర పరిశ్రమలను కన్నడం వైపు తిరిగి చూసేలా చేశాయి. ధృవ సర్జా కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రానికి ప్రేమ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్ కీలక పాత్ర పోషించారు. ఆపై శిల్పాశెట్టితోపాటు రవిచంద్రన్ నటిస్తున్నారు. కాగా ఈ చిత్రం తమిళనాడు విడుదల హక్కులను ఉదయనిధి స్టాలిన్‌కు చెందిన రెడ్‌జెయింట్ మూవీస్ సంస్థ భారీ ధరకు కొనుగోలు చేసింది. కన్నడం, తెలుగు, తమిళం, మలయాళం హిందీ భాషల్లో భారీ ఎత్తున ఈ చిత్రం డిసెంబర్‌లో విడుదల కానుంది. %ఖఎచీ% ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ నారాయణ కోనంకి, నిషా వెంకట్ కోనంకి నిర్మించారు.

Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,